


రామనామమే జీవనం...

- తూము నరసింహదాసు కీర్తనలకు జీవం పోస్తున్న నేమాని పార్థసారథి
- 70 కీర్తనలకు స్వరపరిచిన ఘనత
- నేడు భద్రాచలంలో దేవస్థానం ఆధ్వర్యంలో సన్మానం

4



సత్తుపల్లి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యవసాయం, పారిశ్రామిక, రాజకీయపరంగా చైతన్యవంతమైందని, అలాంటి ఈ జిల్లాలో ప్రస్తుతం ఉన్న 2300 చిన్నతరహా పరిశ్రమలను 10వేలకు పెంచే విధంగా పనిచేస్తున్నామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. సత్తుపల్లి మండలం బుగ్గపాడులో గురువారం మెగా ఫుడ్‌పార్క్ ప్రారంభోత్సవం అనంతరం సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అధ్యక్షతన జరిగిన ప్రజాపాలన విజయోత్సవ సభలో ఆయన మాట్లాడారు.

ఖమ్మం జిల్లాలో గ్రానైట్, స్పిన్నింగ్, జిన్నింగ్ మిల్లులు 400, రైస్‌మిల్లులు 400 ఉన్నాయని, చిన్నతరహా పరిశ్రమలు 2300ఉన్నాయన్నారు. జిల్లాను పారిశ్రామికంగా అభివృద్ధి చేసేందుకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తామని అన్నారు. శాస్త్రీయంగా పరిశ్రమలు ఏర్పాటు చేయడంతోపాటు మార్కెటింగ్ కూడా కల్పిస్తామన్నారు. మెగా ఫుడ్‌పార్క్‌లో పరిశ్రమలు ఏర్పాటు చేసేవారికి ప్రోత్సాహకాలు అందించే విధంగా ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు.







మెగా ఫుడ్‌పార్క్‌ను ప్రారంభిస్తున్న మంత్రులు దుద్దిళ్ల, తుమ్మల

చిన్నతరహా పరిశ్రమలను ప్రోత్సహిస్తాం..

- జిల్లాలో సంఖ్యను 10 వేలకు పెంచేలా కృషి
- బుగ్గపాడు మెగా ఫుడ్ పార్క్‌లో సకల సౌకర్యాలు
- పరిశ్రమల ఏర్పాటుకు పారిశ్రామికవేత్తలు ముందుకురావాలి
- రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు
- బుగ్గపాడులో ఘనంగా మెగా ఫుడ్‌పార్క్ ప్రారంభోత్సవం
- హోరెత్తిన ప్రజాపాలన విజయోత్సవ సభ

ఇందులో భాగంగా ఈ ఫుడ్‌పార్క్‌ను స్పెషల్ కేటగిరీగా పరిగణిస్తామన్నారు. ఫుడ్‌పార్క్‌లో పరిశ్రమల ఏర్పాటుకు పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. బుగ్గపాడు ఫుడ్ పార్క్‌లో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల ఏర్పాటుకు మహిళలకు అవకాశం కల్పిస్తామని, దీనికోసం వెంటనే స్థలం కేటాయించాలని జిల్లా అధికారులను ఆయన ఆదేశించారు. జిల్లాలో జలగం వెంగళరావు తర్వాత వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు గణనీయమైన అభివృద్ధి పనులు చేపట్టి పూర్తిచేశారని ప్రశంసించారు.

అన్నివసతులతో ఫుడ్‌పార్క్ నిర్మాణం...

రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా బుగ్గపాడులో మెగా ఫుడ్‌పార్క్ అన్ని మౌలిక వసతులతో నిర్మితమైందన్నారు. వైఎస్ ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో మెగా ఫుడ్‌పార్క్ అంకురార్పణ జరిగిందని, గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో తనకు అవకాశం వచ్చినప్పుడు రూ.100కోట్ల నాబార్డు నిధులు (మిగతా 4వ పేజీలో)

ఏడు కంపెనీలకు అగ్రిమెంట్

ఫుడ్‌పార్క్‌లో పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు గానూ ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలతో ఒప్పందం జరిగింది. దీనికోసం స్థలాలను కేటాయించారు. వీటికి సంబంధించిన పత్రాలను మంత్రులు శ్రీధర్‌బాబు, తుమ్మల నాగేశ్వరరావు, ఐడీసీ చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి, ఎమ్మెల్యే రాగమయి వారికి అందజేశారు.

రైతు రుణమాఫీ

బూటకం

- జిల్లాలో లక్ష మందికిపైగా రైతులకు లబ్ధి జరగలేదు
- సమస్యల సాకుతో అధికారులు తప్పించుకుంటున్నారు
- నేటి నుంచి రైతు పోరుబాట
- తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు

ఖమ్మం టౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రెండు లక్షల రూపాయలలోపు రుణమాఫీ పూర్తి అయిందని ప్రభుత్వం ప్రకటించటం బూటకమని తెలంగాణ రైతుసంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు విమర్శించారు. రుణమాఫీ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం నుంచి జిల్లావ్యాప్తంగా వారంరోజుల పాటు రైతు పోరుబాట కార్యక్రమం చేపడతామని పేర్కొన్నారు. గురువారం సీపీఎం జిల్లా కార్యాలయం సుందరయ్యభవన్‌లో రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు మాదినేని రమేష్ అధ్యక్షతన జరిగిన రైతుసంఘం సమావేశంలో బొంతు రాంబాబు మాట్లాడుతూ జిల్లాలో లక్షమందికి పైగా రైతులకు రుణమాఫీ కాలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.2లక్షలలోపు రుణమాఫీ ప్రక్రియ పూర్తయినట్టు ప్రకటించటం రైతులను మభ్యపెట్టేందుకేనన్నారు. ఖమ్మం డీసీసీబీ పరిధిలో ఇంకా 80వేల మంది రైతులకు రుణమాఫీ చేయకుండా రుణమాఫీ ప్రక్రియ పూర్తయినట్టు ఎలా ప్రకటించారని ప్రశ్నించారు. నవంబరు 30న రైతు విజయోత్సవ సభలో ప్రకటించిన రూ.3వేల కోట్లలో ఒక్క రూపాయి కూడా రైతుల ఖాతాల్లో జమకాలేదని బొంతు రాంబాబు (మిగతా 4వ పేజీలో)

మెరిట్ ఉన్నా..

దక్కని కొలువు

- ఉపాధ్యాయుల భర్తీ ప్రక్రియలో వెలుగు చూస్తున్న వివాదాలు
- స్పెషల్ ఎస్టీటీ పోస్టుల భర్తీలో అన్యాయం జరిగిందంటున్న మహిళా అభ్యర్థి
- మెరిట్‌లో తనకంటే దిగువన ఉన్న వ్యక్తికి ఉద్యోగం ఇచ్చారని వెల్లడి
- రాష్ట్ర విద్యాశాఖ అధికారుల ఆదేశాల ప్రకారమే చేశామంటున్న డీఈవో

ఖమ్మం ఖానాపురంహవేలి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో జరిగిన డీఎస్సీ-24 నియామక ప్రక్రియలో లోపాలు బయటపడుతూనే ఉన్నాయి. అధికారుల నిర్లక్ష్యం... పరీక్ష రాసిన అభ్యర్థుల పాలిట శాపంగా మారుతోంది. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూసిన ఉద్యోగ కల నెరవేరిందనుకునే లోపే వచ్చిన ఉద్యోగం ఊడిపోతోంది. అన్ని అర్హతలున్నా.. కొందరు అభ్యర్థులు ఉద్యోగానికి దూరమవుతున్నారు. గత అక్టోబరు మొదటివారంలో ఏడుగురు అభ్యర్థుల సర్టిఫికెట్లు సరిగా పరిశీలించకుండానే వారికి నియామక పత్రాలు ఇచ్చి, తర్వాత తప్పు తెలుసుకొని సదరు అభ్యర్థుల నియామకాలను రద్దు చేసిన విషయం విదితమే. దీనిపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తగా, తాజాగా విద్యాశాఖ అధికారుల (మిగతా 4వ పేజీలో)

వెంటాడిన విధి

- రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల దుర్మరణం
- వరంగల్ క్రాస్‌రోడ్డు వద్ద ఆర్టీసీ బస్సు-బైక్ ఢీ
- మృతులు తిరుమలాయపాలెం మండల వాసులు
- కన్నీరుమున్నీరైన పడమటితండా

వివరాలు 4లో



హర్షవర్ధన్ (ఫైల్)



జి.శివరాజు (ఫైల్)

సాయితేజ మృతదేహానికి

నేడు అంత్యక్రియలు

- గత నెల 30న అమెరికాలో దుండగుల కాల్పుల్లో మృతి
- వారంరోజుల తర్వాత మృతదేహం తరలింపు



సాయితేజ (ఫైల్)

ఖమ్మం క్రైం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరానికి చెందిన నూకవరపు సాయి తేజ(22) గత నెల 30న అమెరికాలో గుర్తుతెలియని దుండగుల కాల్పుల్లో మృతిచెందిన విషయం విదితమే. దాదాపు వారంరోజుల తర్వాత ఆయన మృతదేహం శుక్రవారం ఖమ్మం చేరుకోనుంది. దీంతో స్థానికంగా విషాదఛాయలు అలుముకున్నాయి. ఆరు నెలల క్రితం ఉన్నత విద్య కోసం అమెరికాకు వెళ్లిన సాయితేజ.. విస్కన్సిన్ రాష్ట్రంలో ఓ షాపింగ్‌మాల్‌లో విధుల్లో ఉండగా గుర్తు తెలియని దుండగులు వచ్చి డబ్బులు డిమాండ్ చేశారు. సాయితేజ డబ్బులు ఇచ్చినప్పటికీ వారు కాల్పులు జరిపారు. దీంతో సాయితేజ అక్కడికక్కడే మృతిచెందాడు. అమెరికా చట్టాల ప్రకారం అన్ని ప్రక్రియలు పూర్తి చేసిన అనంతరం సాయితేజ మృతదేహాన్ని గురువారం అక్కడి స్నేహితులకు, బంధువులకు అప్పగించారు. దీంతో 'తానా' సభ్యులు సాయితేజ మృతదేహాన్ని మధ్యాహ్నం విమానంలో ఇండియాకు పంపించారు. శుక్రవారం ఉదయం ఖమ్మం చేరుకున్న అనంతరం నగరంలోని రాపర్తి నగర్‌లోని నివాసం వద్ద ఉంచుతారు. తరువాత ఉదయం 11గంటల సమయంలో వారి స్వగ్రామం రామన్నపేటలో అంత్యక్రియలు నిర్వహిస్తారు.

సేవలకు తగిన ప్రతిఫలం ఏదీ!?



- ఎదుగూబొదుగూ లేని హోంగార్డుల జీవితాలు
- అరకొర వేతనాలతో భారంగా కుటుంబపోషణ
- శాంతిభద్రతల పరిరక్షణలో తమదైన పాత్ర పోషిస్తున్నా.. దక్కని గుర్తింపు

నేడు 'హోంగార్డు రైజింగ్ డే'

సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణలో కీలకపాత్ర పోషించేది పోలీసు వ్యవస్థ. కానిస్టేబుల్ స్థాయి నుంచి ఎస్పీ స్థాయి వరకు అందరూ తమదైన పాత్రను పోషిస్తుంటారు. వీరిలో హోంగార్డులది ప్రత్యేక పాత్ర. వీరు పోలీస్‌స్టేషన్లలోనే కాకుండా రవాణ, ఆర్టీసీ, ట్రాఫిక్, జైళ్లు, అగ్నిమాపక, మార్కెట్ వంటి ఇతర విభాగాల్లో కూడా విధులు నిర్వర్తిస్తుంటారు. రెగ్యులర్ పోలీసు సిబ్బందితో సరి సమానంగా వీరు పనిచేస్తున్నప్పటికీ వేతనాలు, ఇతర ప్రయోజనాల విషయం లో వీరికి అన్యాయం జరుగుతోంది. అరకొర వేతనాలతో కుటుంబాలను పోషించలేక అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఒక్క రోజు సెలవు పెడితే ఆ రోజు వేతకం కట్ అవుతుంది. దీంతో సెలవులనేవే లేకుండా చెమటోడ్చుతున్నారు. శుక్రవారం (డిసెంబరు 6) 'హోంగార్డు రైజింగ్ డే' ప్రత్యేక కథనం...

ఖమ్మం క్రైం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): 1963 డిసెంబరు 6న అప్పటి ప్రధానమంత్రి మొరార్జీదేశాయ్ హోంగార్డుల వ్యవస్థను మనదేశంలో ప్రారంభించారు. 1992లో హోంగార్డులను రోజువేతనంగా విధులకు తీసుకుని వారికి రోజుకు రూ.22 చెల్లించేవారు. ప్రస్తుతం ప్రభుత్వం హోంగార్డులకు రోజుకు రూ.745చొప్పున నెలకు రూ.22,350 జీతంగా ఇస్తున్నారు. గతంలో వీరికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిపి జీతాలు ఇచ్చేవి. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వమే చెల్లిస్తోంది. ముందు వీరిని గార్డులు అని పిలిచేవారు. రానురాను వీరిని హోంగార్డులుగా పిలుస్తున్నారు.

జిల్లాలో 558మంది

ఖమ్మం జిల్లాలో 558 మంది హోంగార్డులున్నారు. వీరిలో మహిళలు 58, పురుషులు 500 విధులు నిర్వహిస్తున్నారు.

హెల్త్‌కార్డులు లేవు

రోడ్లపై, పోలీస్‌స్టేషన్లలో ఎండను సైతం లెక్కచేయకుండా విధులు నిర్వహించే హోంగార్డులకు హెల్త్‌కార్డులు లేవు. ఏదైనా కష్టం వస్తే సిబ్బంది ఒకరికి ఒకరు సహకరించుకుంటూ విధులు నిర్వహిస్తున్నారు. హెల్త్‌కార్డులు ఇవ్వాలని పలుసార్లు సిబ్బంది మంత్రులకు, అధికారులకు వినతులు అందించారు. అయినా ఇప్పటివరకు ఎటువంటి స్పందనలేదు.

ఎక్స్‌గ్రేషియా లేవు

హోంగార్డులు ఏదైనా సాధారణంగా మరణిస్తే వారికి ప్రభుత్వం నుంచి కాని డిపార్టుమెంట్ నుంచి కాని ఎటువంటి ఎక్స్‌గ్రేషియా ఉండదు. కేవలం విధులు నిర్వహించినందుకు రోజువారి జీతంగా ఇస్తారు. ఎవరైనా హోంగార్డులు మరణించినా.. రిటైర్డు అయినా.. వారికి జిల్లాలోని హోంగార్డులు అందరు కలిసి వారి ఒకరోజు వేతనం ఎక్స్‌గ్రేషియాగా వారికి వారే ప్రకటించుకుని యానియన్ ద్వారా వారికి అందిస్తున్నారు.ఈ సందర్భంగా వీరిని పలువురు అధికారులు సైతం ప్రసంసిస్తున్నారు.

హోంగార్డుల విధులు

హోంగార్డులు పోలీసులకు సహయకారిగా పనిచేయడం సాధారణ, అంతర్గత భద్రతను కాపాడడంలో సహయపడతారు. దాడులు, లేదా ఏదైనా ప్రకృతి వైపరీత్యాలు, గొడవలు వంటివి జరిగినప్పుడు సమాజానికి సహయం చేస్తూ అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కాపాడుతుంటారు.

హెల్త్‌కార్డులు మంజూరు చేయాలి

తేజావత్ రవికుమార్ నాయక్



ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా హోంగార్డులను కూడా ప్రభుత్వం గుర్తించి హెల్త్‌కార్డులు మంజూరు చేయాలి. అనారోగ్య సమస్యలు వస్తే చాలా ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వం గుర్తించి వెంటనే హెల్త్‌కార్డులు మంజూరు చేసేందుకు కృషిచేయాలి. గతంలో పలుమార్లు నాయకులు, మంత్రులను కలిసి విన్నవించినా ఎలాంటి ఫలితం లేదు. వెంటనే హెల్త్ కార్డులు మంజూరుచేయాలి.

సాధారణ సెలవులు ఇవ్వాలి

దివ్య, హోంగార్డు



ప్రభుత్వ శాఖల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల మాదిరిగా మాకు కూడా సాధారణ సెలవులు మంజూరు చేయాలి. ఏదైనా అత్యవసర పని ఉంటే సెలవులు పెట్టాలంలే ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు స్పందించి మాకు కూడా సెలవులు మంజూరుచేయాలి. అదేవిధంగా ప్రమాదవశాత్తు మృతిచెందిన హోంగార్డుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుని ఎక్స్‌గ్రేషియా కింద కొంత డబ్బు అందిస్తే బాగుంటుంది.

దశవిధ ఉత్సవాల రూపకర్త

నేడు రాజా తూము లక్ష్మీనరసింహదాసు 234వ జయంతి



భద్రాచలం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): దశవిధ ఉత్సవాల రూపకర్త... స్వామివారికి ఉదయం సుప్రభాత సేవ నుంచి రాత్రి పవళింపు సేవ వరకు పలు రకాల ఉత్సవాలు ఏర్పాటు చేసి ఆ ఉత్సవాలకు తగినటువంటి కీర్తనలను రచించినటువంటి ఘనత ఆయనకే దక్కింది. రామదాసు భద్రాద్రి క్షేత్ర ఆవిష్కర్త అయితే ఉత్సవాలతో భద్రగిరికి మరింత శోభ తీసుకొచ్చారు రాజా తూము లక్ష్మీ నరసింహదాసు. భద్రాద్రి రాముని సేవ కోసం ప్రభుత్వ ఉద్యోగాన్ని కూడా వదిలేసి రామభక్తిలో తరిస్తూ తీర్థయాత్రలను చేస్తూ భద్రాచలానికి వచ్చి తన స్నేహితుడైన వరద రామదాసు సాయంతో ఆలయాభివృద్ధికి నడుం బిగించారు. భక్తరామదాసు తరువాత రామయ్యను కొలిచిన అంతటి మహాభక్తుడు నరసింహదాసు. దశాబ్ద కాలం క్రితం మాడ వీధుల అభివృద్ధి పేరుతో శతాబ్దాలకాలంగా ఉన్న తూము నరసింహదాసు ఇంటిని తొలగించడం జరిగింది. ఆలయ ప్రాంగణంలో భక్తరామదాసు విగ్రహాన్ని ఏర్పాటు చేయగా, తూము నరసింహదాసు విగ్రహాన్ని ఏర్పాటు చేస్తే సముచితంగా ఉంటుందనే అభిప్రాయం రామ భక్తుల్లో ఉంది. కానీ ఆ దిశగా దేవస్థానం అధికారులు కసరత్తు చేయకపోవడం రామ భక్తులను ఆవేదనకు గురి చేస్తోంది.

దర్బారు సేవతో రామయ్యకు దర్జా...

దశవిధ ఉత్సవాల్లో అత్యంత కీలకమైంది దర్బారు సేవ. ఈ దర్బారుసేవ ప్రపంచంలో ఏ క్షేత్రంలో నిర్వహించనటువంటి ప్రత్యేక సేవ. దర్బారు సేవతో రామచంద్రుడికి దర్జాను తెచ్చారు నరసింహదాసు. దంతధావన మరయగ.. పూజ సేయరే.. బంగారు పూలతో పూజ సేయరే... లాంటి మధురాతి మధురమైన కీర్తనలు రూపొందించారు మరో రామదాసుగా ప్రసిద్ధిగాంచిన నరసింహదాసు. ఆయన ఇచ్చిన స్ఫూర్తితోనే 1998లో భద్రాద్రి రామయ్యకు 108 బంగారు పుష్పాలను చిన్నజీయర్‌స్వామి రామయ్య సేవకు సమర్పించారు. కాగా నరసింహదాసు చెక్కించిన శిలా శాసనాలు, రామస్తంభం నేటికి భద్రాద్రి ఆలయంలో భక్తులకు దర్శనమిస్తాయి. ఆనాడు ఆచరించిన ఉత్సవాదులకు అక్షర రూపంగా దర్శనమిస్తున్నాయి. నేడు నరసింహదాసు 234వ జయంతిని శ్రీసీతారామ చంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించనున్నారు. ఆలయ ప్రాకార మండపంలో గిరి ప్రదక్షిణ, పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. సాయంత్రం 3.30నుంచి భక్తి సంగీత కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

రామనామమే జీవనం..

- తూము నరసింహదాసు కీర్తనలకు జీవం పోస్తున్న నేమాని పార్థసారథి

భద్రాచలం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): 'దంతదావనం దడయ....., పూజసేయరే బంగారు పూలతో పూజ సేయరే....సెలవా మాకు సెలవా......, రామనామమే మాకు జీవనం..... దాశరథి తోడ సరిదైవమేదే....' ఇవి అభినవ రామదాసుగా పేరుగాంచిన రాజా తూము లక్ష్మీనరసింహదాసు రచించి గానం చేసిన కీర్తనలు. ఈ కీర్తనలకు ప్రముఖ సినీ నేపథ్యగాయకుడు నేమాని పార్థసారథి జీవం పోస్తున్నారు. భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామిని సేవించిన అపర భక్తాగ్రేసరుడైన తూము నరసింహదాసు రచించిన సుమారు 124 కీర్తనలు ప్రస్తుతం అందుబాటులో ఉండగా, అందులో 70 కీర్తనలను స్వరపరిచిన ఘనతను పార్థసారథి దక్కించుకున్నారు. 150 సినిమాల్లో ఎందరో అగ్రహీరోలకు పాటలు పాడిన పార్థసారథి నాలుగువేల భక్తి గీతాలను ఆలపించడమే కాదు, 50 భక్తి ఆల్బమ్‌లను రూపొందించారు. నరసింహదాసు 234వ జయంతిని పురస్కరించుకొని భద్రాచల శ్రీసీతారామచంద్రస్వామి ఆలయ ప్రాంగణంలోని చిత్రకూట మండపంలో దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమంలో శుక్రవారం పార్థసారథి పాల్గొననున్నారు. ఈ సందర్భంగా ఆయనను ఘనంగా సన్మానించనున్నారు.

సుమారు మూడు దశాబ్దాల క్రితం పాడుతా తీయగా తొలి విడత విజేతగా గుర్తింపు పొందిన నేమాని పార్థసారథి ఆస్ట్రేలియాకు వెళ్లిన క్రమంలో రాజా నరసింహదాసు కీర్తనల గురించి తెలుసుకున్నారు. నరసింహదాసు వంశస్తురాలు తూము కృష్ణవేణి.. నరసింహదాసు కీర్తనలకు సంబంధించిన పుస్తకాన్ని ఆయనకు అందజేశారు. అలాగే చెన్నైలో కీర్తనల మాధుర్యాన్ని తెలుసుకొని భక్తరామదాసు, తూము నరసింహదాసు కీర్తనలను పార్థసారధి ఆలపించారు. ఇదే క్రమంలో పిల్లలతో నరసింహదాసు కార్యక్రమం చేయాలని సంకల్పించి అందులో భాగంగా 70 కీర్తనలను స్వరపరిచారు. ఆసక్తి కనబరిచిన వారికి ఆ కీర్తనలను నేర్పించారు.

మన సంస్కృతిపై అవగాహన కల్పించాలి

- **నేమాని పార్థసారథి, ప్రముఖ గాయకుడు**

సంస్కృతి, సాహిత్యం, సంగీతంపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత అందరిపై ఉంది. ఇదే సమయంలో మన సంస్కృతి ఒక పద్యం, పాట, కీర్తన అనే విషయాన్ని భవిష్యత్తు తరాలకు తెలిసేలా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇప్పటి వరకు సుమారు 70మందికి కీర్తనలు నేర్పించా.

ఇంటర్ ఉత్తీర్ణతను వందశాతం పెంచేలా కృషి చేయాలి

డీఐఈవో రవిబాబు

బోనకల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి):ఇంటర్మీడియట్ ఉత్తీర్ణతను వందశాతం పెంచేలా అధ్యాపకులు కృషి చేయాలని ఇంటర్మీడియట్ జిల్లా విద్యాశాఖాధికారి కె.రవిబాబు ఆదేశించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలను గురువారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం అధ్యాపకులతో సమావేశం నిర్వహించారు. విద్యార్థుల హాజరుశాతం పెంచాలన్నారు. వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిని చదువుల్లో ముందుకు తీసుకెళ్లేలా ప్రత్యేక కార్యాచరణను రూపొందించాలని సూచించారు. పరీక్షల్లో వత్తిడిని అధిగమించడానికి పాటించాల్సిన విషయాల పట్ల అవగాహన కల్పించారు. ప్రాక్టికల్ పరీక్షల నిర్వహణతోపాటు సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. అధ్యాపకులు అంకితభావంతో పనిచేసి కళాశాలను అగ్రభాగాన ఉండేలా చూడాలని కోరారు. డ్రగ్స్‌కు విద్యార్థులు దూరంగా ఉండేలా కళాశాలలో చైతన్య సదస్సులను నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నళినిశ్రీ, అధ్యాపకులు పాల్గొన్నారు.

అవయవదానం చేయండి చిరంజీవులు కండి

- తెలంగాణ నేత్ర, అవయవ దాతల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అశోక్

కొణిజర్ల, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): అవయవదానం అత్యున్నతమైనదని, మరణించిన తర్వాత కూడ చిరంజీవులుగా మారి గుర్తుండి పోతారని తెలంగాణ నేత్ర శరీర అవయవదాతల సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి డాక్టర్ పరికిపండ్ల అశోక్ తెలిపారు. గురువారం తనికెళ్ళ పంచాయతీ కార్యాలయ ఆవరణంలో ఆరోగ్యమిత్ర సంస్థ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశంలో 12 లక్షల మంది అంధులు ఇంత వరకు ప్రపంచాన్ని చూడలేక నేత్రదాతల కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈవో శ్రీనివాస్‌రాజ్, పంచాయతీ కార్యదర్శి రవికుమార్, మిషన్ భగీరథ బాధ్యులు ఉమాశంకర్, జోగారావు, ఫీల్డ్‌అసిస్టెంట్ రమేష్, భానుప్రకాశ్, డాక్టర్ ఆడెపు రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

టీటీ క్రీడాకారులను అభినందించిన కేరళ స్పీకర్

ఖమ్మం స్పోర్ట్స్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): కేరళ రాష్ట్రంలోని త్రివేంద్రంలో జరుగుతున్న జాతీయస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీల్లో తెలంగాణా రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న జిల్లాకు చెందిన పలువురు క్రీడాకారులను కేరళ అసెంబ్లీ స్పీకర్ ఏఎన్.శంషీర్ అభినందించారు. నగరానికి చెందిన పరిటాల జ్వలిత్, గౌరిశెట్టి చార్విక్, షేక్ ఫైజల్, సాయిశివాని, వంశిక, మహ్మద్ అనాస్, గద్దల సిరి, కోటగిరి హితేష్‌లను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర జట్టుకు ఎంపికైన జిల్లా క్రీడాకారులను డీవైఎస్‌వో సునీల్‌రెడ్డి, జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బాలసాని విజయ్, ఓలేటి సాంబమూర్తి తదితరులు అభినందించారు.

చిన్నతరహా పరిశ్రమలను ప్రోత్సహిస్తాం

(3వ పేజీ తరువాయి)

సాధించి పనులు ప్రారంభింపజేశానన్నారు. తరువాత దీనిని పట్టించుకున్న వారు లేరని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మంత్రి శ్రీధర్‌బాబు సహకారంతో ఫుడ్‌పార్క్ ప్రారంభోత్సవానికి అవసరమైన ఏర్పాట్లు వేగంగా జరిగాయని అన్నారు. మంత్రి శ్రీధర్‌బాబు చొరవతో ఫుడ్‌పార్క్‌లో పరిశ్రమల ఏర్పాటుకు అధికారులు ఔత్సాహికవేత్తలతో ఇండస్ట్రీయల్ సమ్మిట్ ఏర్పాటుచేసి సంప్రదింపులు జరుపుతున్నారని, ఈ క్రమంలో ఏడు కంపెనీలు పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వచ్చాయని తెలిపారు.

సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి మాట్లాడుతూ బుగ్గపాడు ఫుడ్‌పార్క్‌ను గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని, ప్రస్తుత రాష్ట్రమంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఫుడ్‌పార్క్‌లో పనులను పూర్తి చేయించి వినియోగంలోకి తెచ్చేందుకు కృషి చేశారని అన్నారు. సత్తుపల్లి మండలంలో బొగ్గు గనులు ఉన్నాయని, ఇక్కడ థర్మల్ పవర్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని కోరారు. సత్తుపల్లిలో ప్రభుత్వ మహిళా డిగ్రీ, పీజీ కళాశాల ఏర్పాటు చేయాలని, బేతుపల్లి పెద్ద చెరువు, లంకాసాగర్ ప్రాజెక్టు అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలన్నారు.



ప్రదర్శనలను తిలకిస్తున్న మంత్రులు తుమ్మల, శ్రీధర్‌బాబు

టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజా సమస్యలను గాలికొదిలేసిందని ఆరోపించారు. 6 గ్యారంటీలు ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఐఐసీ ఎండీ విష్ణువర్ధన్‌రెడ్డి, జిల్లా



సభకు హాజరైన మహిళలు

కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, వేర్ హౌసింగ్ కార్పొరేషన్, హ్యాండ్‌లూమ్ కార్పొరేషన్ చైర్మన్లు రాయల నాగేశ్వరరావు, నాయుడు సత్యనారాయణ ప్రసంగించారు.

ఉద్దీపకం బుక్‌లెట్‌తో.. స్టడీ అవర్స్ నిర్వహించాలి

- వంద రోజుల ప్రణాళికతో విద్యార్థులను చదివించాలి
- ఐటీడీఏ పీవో రాహుల్



ప్రసంగిస్తున్న ఐటీడీఏ పీవో రాహుల్

భద్రాచలం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): గిరిజన పిల్లల భవిష్యత్తు బాగుపడాలంటే తప్పనిసరిగా హెచ్‌ఎం, వార్డెన్‌లు సబ్జెక్టు టీచర్లు ప్రత్యేక దృష్టి సారించి నూతనంగా ప్రవేశపెట్టిన ఉద్దీపకం బుక్‌లెట్‌తో సాయంత్రం స్టడీ అవర్స్ తప్పనిసరిగా నిర్వహించాలని భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాహుల్ అన్నారు. గురువారం బీఈడీ కళాశాలలో జిల్లాలోని హెచ్‌ఎం, వార్డెన్లతో ఎస్ఎస్సీ విద్యార్థులకు వంద రోజుల ప్రణాళిక ద్వారా చేపట్టాల్సిన కార్యాచరణపై ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ ఈ ఏడాది ఆశ్రమ పాఠశాలల్లో ఇంగ్లీషు మీడియం ప్రవేశపెట్టినందున సులభమైన పద్ధతిలో పిల్లలకు అర్థమయ్యే రీతిలో పంపిణీ చేసి ఉద్దీపకం వరకు బుక్స్ స్టడీ అవర్స్ పెంచాలన్నారు. డీ గ్రేడ్ పిల్లలను గుర్తించి వారికి ప్రత్యేకంగా హెచ్‌ఎం, సబ్జెక్టు టీచర్లు ప్రత్యేక తరగతులు నిర్వహించి వారు పాసయ్యేలా ప్రోత్సహించాలన్నారు.

మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలి

అలాగే వసతి గృహాల్లో పిల్లలకు మెనూప్రకారం పౌష్టికాహారం అందించాలన్నారు. వంటశాల పరిసరాలు శుభ్రంగా ఉండాలని, వంట పూర్తయిన అనంతరం ఇద్దరు ఉపాధ్యాయులు వంటను రుచి చూసిన తర్వాతే విద్యార్థులకు పెట్టాలన్నారు.కార్యక్రమంలో డీడీ మణెమ్మ, విజయలక్ష్మి, ఏసీఎంవో రమణయ్య, శ్రీరాములు, ఏటీడీవోలు జహీరుద్దీన్, అశోక్‌కుమార్, చంద్రమోహన్, సత్యవతి, రాధమ్మ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి వీడియో కాన్ఫరెన్సు

రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ కార్యదర్శి శరత్ రాష్ట్రంలోని ఐటీడీఏ పీవో, డీడీ, టీడీడీవోలతో వీడి యో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ్రమ పాఠశాలలు, గురుకులాల్లో నూతనంగా మెనూప్రకారం పౌష్టికాహారం అందించాలన్నారు.

మెరిట్ ఉన్నా..దక్కని కొలువు

(3వ పేజీ తరువాయి)

నిర్లక్ష్యానికి సంబంధించి మరో ఘటన వెలుగులోకి వచ్చింది.

మెరిట్ అభ్యర్థికి అన్యాయం..

డీఎస్సీ పరీక్షల్లో స్పెషల్ ఎస్‌జీటీలో 27వ ర్యాంక్ సాధించి, బీసీ 'డీ' రోస్టర్‌లో ప్రథమ స్థానం సాధించిన కె.సంధ్యారాణి అనే మహిళ 1:3 మెరిట్ జాబితా ప్రకారం సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరైంది. ఆ సమయంలో సాంకేతిక కారణాల వల్ల సీఆర్ఆర్‌లో అడిషనల్ క్వాలిఫికేషన్ సర్టిఫికెట్ డౌన్లోడ్ కాలేదు. దాంతో జిల్లా విద్యాశాఖ అధికారి ఆమెను తిరస్కరించారు. తర్వాత బీసీ 'డీ' రోస్టర్‌లో 38వ ర్యాంక్ సాధించిన అభ్యర్థి సర్టిఫికెట్లు పరిశీలించగా అతడు లోకల్ ఏరియా సర్టిఫికెట్ తీసుకురాకపోవటంతో అతడిని కూడా పరిగణలోకి తీసుకోలేదు. అయితే ఆ ఇద్దరు అభ్యర్థులకు కొన్ని రోజులు గడువు ఇస్తూ సంబంధిత సర్టిఫికెట్లను సమర్పించాలని సూచించారు. దాంతో సంధ్యారాణి అక్టోబరు 11న, రెండో వ్యక్తి అక్టోబరు 5న తమ సర్టిఫికెట్లను అందించారు. కానీ మెరిట్‌లో ఉన్న సంధ్యారాణికి ఇవ్వాల్సిన పోస్టును నవంబరు 29న ఆమె తర్వాత మెరిట్‌లో ఉన్న వ్యక్తికి ఇస్తూ జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి రాష్ట్ర విద్యాశాఖ నుంచి ఉత్తర్వులు వచ్చాయి.

అయితే ఆ ఇద్దరి సర్టిఫికెట్లను అక్టోబరు 16న డీఎస్సీ కార్యాలయానికి పంపించామని, హైదరాబాద్ నుంచే మెరిట్‌లిస్ట్‌లో ఉన్న వ్యక్తిని ఎంపిక చేశారని జిల్లా విద్యాశాఖ అధికారులు తెలిపారు. కానీ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ఇలా జరిగిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అభ్యర్థులకు సంబంధించి జిల్లా విద్యాశాఖ నుంచి హైదరాబాద్‌కు పంపించిన లేఖల్లోనే తప్పులు ఉన్నట్టు తెలిసింది. కాగా తాను మెరిట్ జాబితాలో ముందే ఉన్నా తనకు ఉద్యోగం ఇవ్వకుండా తన తర్వాత స్థానంలో ఉన్నవారికి ఇచ్చారంటూ సంధ్యారాణి గురువారం జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్టు సమాచారం.

మెరిట్ ప్రకారం నాకే ఉద్యోగం రావాలి

కె.సంధ్యారాణి, స్పెషల్ ఎడ్యుకేషన్ అభ్యర్థి



డీఎస్సీ 2024 స్పెషల్ ఎడ్యుకేషన్‌లో 'బీసీ డీ' రోస్టర్‌లో జిల్లాస్థాయిలో ప్రథమస్థానంలో ఉన్నాను. సర్టిఫికెట్ల పరిశీలన సమయంలో అడిషనల్ క్వాలిఫికేషన్ సర్టిఫికెట్ సాంకేతిక కారణాలతో డౌన్‌లోడ్ కాకపోవటంతో అధికారులు నా అభ్యర్థిత్వాన్ని తిరస్కరించారు. నా తరువాత బీసీ-డీలో 38వ ర్యాంక్ సాధించిన వ్యక్తి తన లోకల్ ఏరియా సర్టిఫికెట్ సమయానికి సమర్పించకపోవటంతో ఆయన అభ్యర్థిత్వాన్ని తిరస్కరించి ఇద్దరినీ హోల్డ్‌లో ఉంచారు. అనంతరం ఇద్దరం సంబంధిత సర్టిఫికెట్లను విద్యాశాఖకు అందించాం. కానీ మెరిట్‌లిస్ట్ ప్రకారం నాకు రావాల్సిన ఉద్యోగం నా కంటె వెనుక ర్యాంక్ ఉన్న వ్యక్తికి వచ్చింది. దీనిపై అనుమానాలు ఉన్నాయి. దీనిపై నేను న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తా..

డీఎస్సీ కమిటీ నిర్ణయం ప్రకారమే ఎంపిక..

- **సోమశేఖర శర్మ, ఖమ్మం డీఈవో**

డీఎస్సీ కమిటీ నిర్ణయం ప్రకారం అర్హులైన అభ్యర్థులే ఉద్యోగాలు పొందారు. అందులో జిల్లా విద్యాశాఖ అధికారుల ప్రమేయం ఉండదు. స్పెషల్ ఎడ్యుకేషన్‌లో ఇద్దరు అభ్యర్థులకు సంబంధించిన వివరాలు హైదరాబాద్‌లోని డీఎస్సీ కమిటీకి అందించాం. వారి ఆదేశాలతోనే అర్హులను ఎంపిక చేశారు. వారు ఎంపిక చేసిన అభ్యర్థులనే జిల్లా కమిటీలో చర్చించి తుది నిర్ణయం తీసుకుంటారు. 2024 డీఎస్సీలో అర్హులకే ఉద్యోగాలు అందించాం.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి

ఖమ్మం రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): వాళ్లిద్దరూ ఒకే ఊరి వారు. ఒకరు ఇప్పటికే తల్లిదండ్రులను కోల్పోయి బాబాయి వద్ద ఉంటుండగా, మరొకరు తండ్రిని కోల్పోయి తల్లి రెక్కల కష్టంతో చదువుకుంటున్నాడు. వీరిద్దరూ బైక్‌పై ఖమ్మం నుంచి కూసుమంచి వెళ్తుండగా మృత్యువు రూపంలో ఆర్టీసీ బస్సు కాటేసింది. దీంతో ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. ఈ సంఘటనతో తిరుమలాయపాలెం మండలంలోని పడమటితండాలో తీవ్ర విషాదం నెలకొంది.

రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... తిరుమలాయపాలెం మండలం, హైదరసాయిపేట గ్రామ పంచాయతీ పరిధిలోని పడమటితండాకు చెందిన గుగులోతు శివరాజు(19), మూడు హర్షవర్ధన్(15) అనే ఇద్దరు యువకులు ద్విచక్ర వాహనంపై ఖమ్మం నుంచి కూసుమంచి వైపు వెళ్తున్నారు. అదే సమయంలో కూసుమంచి వైపు నుంచి ఖమ్మం వస్తున్న ఆర్టీసీ బస్సు వరంగల్ క్రాస్‌రోడ్డులో ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శివరాజు, హర్షవర్ధన్‌లు అక్కడికక్కడే మృతి చెందారు. తమ ముందు వెళ్తున్న వాహనాన్ని ఓవర్‌టేక్ చేసే క్రమంలో ఈ ప్రమాదం చోటుచేసుకున్నట్టు తెలుస్తోంది. హర్షవర్ధన్ 9వ తరగతి వరకు చదువుకుని కూలిపనులకు వెళ్తున్నాడు. శివరాజ్ ఖమ్మంలోని ఓ ఇంజనీరింగ్ కళాశాలలో డిప్లమా చదువుతున్నాడు.

హర్షవర్ధన్ తల్లిదండ్రులు మూడు బిచ్చు, జ్యోతి కొంతకాలం క్రితం మృతిచెందారు. తండ్రి బిచ్చు అనారోగ్యంతో మృతిచెందగా, తల్లి జ్యోతి ఏడాది క్రితం ఆత్మహత్య చేసుకుంది. తల్లిదండ్రులు చనిపోవడంతో హర్షవర్ధన్ తన బాబాయి ఇంట్లో ఉంటూ కూలిపనులకు వెళ్తున్నాడు. ఏడాదిలోపే తల్లిదండ్రులు చనిపోవడం, ఇప్పుడు హర్షవర్ధన్ కూడా రోడ్డు ప్రమాదంలో చనిపోవడంతో వారి కుటుంబ సభ్యులు, బంధువులు శోకసంద్రంలో మునిగిపోయారు.

అదేవిధంగా శివరాజు తల్లిదండ్రులు భిక్షపతి, సరస్వతి. రెండేళ్ల క్రితం తండ్రి భిక్షపతి అనారోగ్యంతో మృతిచెందాడు. తల్లి కూలిపని చేస్తు శివరాజుని చదివిస్తోంది. కొడుకు ప్రయోజకుడు అవుతాడని ఆ తల్లి కన్న కలలు కళ్ల ముందే ఆవిరవడంతో గుండెలవిసేలా రోదిస్తున్నది. ఒకే గ్రామంలో ఇద్దరు యువకులు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఆ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

9, 10 తేదీల్లో సైన్స్‌ఫెయిర్

ఖమ్మం ఖానాపురం హవేలి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్ (2024-25), జిల్లాస్థాయి ఇన్‌స్పైర్(2023-24)ను ఈనెల 9, 10 తేదీల్లో నిర్వహిస్తునట్టు జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖర శర్మ తెలిపారు. ఈ రెండు ప్రదర్శనలను నగరంలోని బల్లేపల్లిలో గల ఎస్ఎఫ్ఎస్ పాఠశాలలో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి సైన్స్ ఫెయిర్‌కు 464 ఎగ్జిబిట్స్ నమోదు చేయగా, ఇన్‌స్పైర్ నమూనాలు 119 ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా సైన్స్ అధికారి దుస్సా జగదీశ్వర్ ఆధ్వర్యంలోని 16మందితో గల కమిటీ పర్యవేక్షిస్తుందని తెలిపారు. విద్యార్థులకు, గైడ్ టీచర్లకు భోజన సదుపాయం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

రైతు రుణమాఫీ బూటకం

(3వ పేజీ తరువాయి)

విమర్శించారు. వ్యవసాయశాఖ, బ్యాంకు అధికారులు కనీసం నాలుగో విడత రుణమాఫీ రైతుల జాబితా కూడా చెప్పలేని పరిస్థితిలో ఉన్నారన్నారు. ఆధార్‌కార్డ్, బ్యాంక్ ఖాతా అనుసంధానంలో జరిగిన తప్పులు, ఇంటిపేర్లు, తదితర సాంకేతిక సమస్యల పేరుతో వేలాది మంది రైతులకు రుణమాఫీ చేయలేదన్నారు. రుణమాఫీ విషయంలో అధికారులపై తప్పు చూపిస్తూ ప్రభుత్వం తప్పుకోవాలని చూస్తున్నదన్నారు. రుణమాఫీ సమస్యలు పరిష్కారం చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లావ్యాప్తంగా శుక్రవారం నుంచి రైతుల వివరాలు సేకరించి పోరాటం చేస్తామన్నారు. ఈ సమావేశంలో తెలంగాణా రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు బండి రమేష్, వాసిరెడ్డి ప్రసాద్, సహాయ కార్యదర్శులు చింతనిప్పు చలపతిరావు. ఎస్‌కే.మీరా. బిక్కసాని గంగాధర్, వీరబాబు పాల్గొన్నారు.

హరీష్‌రావు అరెస్ట్ అక్రమం

ఖమ్మంటౌన్, డిసెంబరు5 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, సిద్ధిపేట శాసన సభ్యుడు తన్నీరు హరీష్‌రావు అరెస్ట్ అక్రమమని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్యలు గురువారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. అసెంబ్లీ సమావేశాల్లో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు రైతు రుణమాఫీ, రైతుబంధుతో సహా పలు ప్రజా సమస్యలపై నిలదీస్తారనే భయంతో హరీష్‌రావును అరెస్ట్ చేశారని పేర్కొన్నారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి



కిషోర్‌శర్మ (ఫైల్)

ఖమ్మం క్రైం, డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): లారీ ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన ఖమ్మం నగరంలో జరిగింది. కొణిజర్ల మండలం అమ్మపాలెం గ్రామానికి చెందిన వ్యాకర్ణం మారుతి కిషోర్‌శర్మ(55) అదే గ్రామంలో పురోహితునిగా పనిచేస్తారు. గురువారం సాయంత్రం సమయంలో నగరంలోని తన కుమార్తె నివాసం వద్దకు వెళ్లేందుకు ద్విచక్ర వాహనంపై వచ్చారు. నూతన బస్‌స్టాండ్ సమీపంలో రోడ్డు క్రాస్ చేస్తుండగా, వెనుక నుంచి ఓలారీ వచ్చి ఢీకొట్టింది. దీంతో కిషోర్‌శర్మ లారీ కింద అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు మృతదేహాన్ని అన్నం శ్రీనివాసరావు సహకారంతో ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకు తరలించారు.

సకాలంలో సరఫరా కాని ఉచిత బియ్యం

» ఖమ్మం జిల్లాలో 748రేషన్‌షాపులు

» ఎదురుచూస్తున్న ఆహారభద్రతా కార్డుదారులు



వైరా, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రేషన్ దుకాణాలకు ఉచిత బియ్యం సరఫరా సకాలంలో జరగడం లేదు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ప్రతినెలా ఒకటోతేదీ కంటే ముందే అన్ని రేషన్‌షాపులకు బియ్యాన్ని సరఫరా చేయాలి. ఆవెంటనే రేషన్‌కార్డుదారులకు ఆబియ్యం పంపిణీ చేయాల్సి ఉంటుంది. అయితే ఈనెల ఐదోతేదీ వరకు జిల్లాలోని సగం రేషన్‌షాపులకు బియ్యం సరఫరా కాలేదు. లబ్ధిదారులు బియ్యం కోసం రేషన్‌షాపుల చుట్టూ తిరుగుతూ ఇబ్బందులకు గురవుతున్నారు. జిల్లాలో 748రేషన్‌షాపుల పరిధిలో 4,11,202మంది ఆహారభద్రతా కార్డుదారులకు దాదాపు 6,027.72మెట్రిక్ టన్నుల బియ్యాన్ని పంపిణీ చేయాల్సి ఉంది. కాగా సగం బియ్యం కూడా రేషన్‌షాపులకు చేరలేదు. ఎఫ్‌సీఐ బఫర్ గోదాముల నుంచి జిల్లాలోని 8ఎంఎల్ఎస్ పాయింట్లకు స్టేజీ-1 కాంట్రాక్టర్లే బియ్యం తోలాల్సి ఉంటుంది. ఎంఎల్ఎస్ గోదాముల నుంచి స్టేజీ-2 కాంట్రాక్టర్ ఆయా రేషన్‌దుకాణాలకు బియ్యం రవాణా చేయాల్సి ఉండగా కొన్నినెలల నుంచి పంపిణీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. దాంతో సకాలంలో బియ్యం అందక లబ్ధిదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. వైరా ఎంఎల్ఎస్ పాయింట్ పరిధిలో కొణిజర్ల మండలంలో 41, తల్లాడ మండలంలో 26, వైరా మండలంలో 29 మొత్తం 96రేషన్‌షాపులున్నాయి. అయితే ఐదోతేదీ దాటుతున్నా ఇంకా 35షాపులకు బియ్యం రవాణా చేయలేదు. ఇప్పటికైనా అధికారులు వెంటనే చర్యలు తీసుకొని సకాలంలో రేషన్‌షాపులకు బియ్యం సరఫరా చేయాలని వినియోగదారులు కోరుతున్నారు.

మోరే భాస్కర్‌కు కన్నీటి వీడ్కోలు

» ఫోన్‌లో కుటుంబ సభ్యులను పరామర్శించిన మాజీ మంత్రి కేటీఆర్



భాస్కర్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీ వద్దిరాజు, వనమా, రేగాకాంతారావు

కొత్తగూడెం పోస్టాఫీసు సెంటర్, డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మోరె భాస్కర్ రావు (52) అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర భాస్కర్‌రావు మృతదేహనికి నివాళులర్పించి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. వీరివెంట మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు, జిల్లా పార్టీ అధ్యక్షుడు రేగా కాంతారావు, వనమా రాఘవేంద్రరావులు అంత్యక్రియల్లో పాల్గొన్నారు. 2001నుంచి టీఆర్ఎస్ పార్టీలో కొనసాగుతూ, పార్టీ అధినేత మాజీ సీఎం కేసీఆర్‌కు అత్యంత సన్నిహితుడిగా కొనసాగాడు. మృతుడి కుటుంబ సభ్యులతో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ఫోన్‌లో పరామర్శించారు. జిల్లా కాంగ్రెస్ నాయకుడు కోనేరు సత్యనారాయణ(చిన్ని) మృతదేహన్ని సందర్శించి నివాళులర్పించారు.

దివ్యాంగుడి ఆత్మహత్య

నేలకొండపల్లి, డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): నేలకొండపల్లి మండలం రాయగూడెంలో బుధవారం రాత్రి ఓ దివ్యాంగుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతడి ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. రాయగూడెం గ్రామానికి చెందిన యర్రం రామారావు(46) దివ్యాంగుడు. అతడికి వివాహం కాలేదు. అతడి తండ్రి బ్రహ్మం సమారు ఎనిమిదేళ్ల క్రితం మృతి చెందాడు. తల్లి నారాయణమ్మ అనారోగ్యంతో బాధపడుతోంది. అయితే బుధవారం రాత్రి తల్లికి భోజనం పెట్టిన తర్వాత అతడు తనకు పని ఉందని చెప్పి మూడు చక్రాలబండిపై బయటకు వెళ్లాడు. ఇంటి నుంచి వెళ్లిన అతడు తన వ్యవసాయబావి వద్దకు వెళ్లి తనతో తెచ్చుకున్న క్రిమిసంహారక మందు తాగి బావిలోకి దూకినట్లు తెలుస్తోంది. రామారావు పొలం పక్కనే ఉన్న పొలాన్ని కౌలు చేస్తున్న రైతు తీగ నాగరాజు గురువారం ఉదయం తన నారుమడి వద్ద పని చేయటానికి వచ్చి చూడగా బావి వద్ద మూడు చక్రాల బండి కనిపించింది. దాంతో అతడు రామారావు మొబైల్‌కు ఫోన్ చేయగా స్విచ్‌ఆఫ్ వచ్చినట్లు తెలిసింది. నారుమడిలో పని పూర్తి చేసిన అనంతరం రైతు నాగరాజు మోటర్ వేయటానికి బావి వద్దకు రాగా రామారావు మృతదేహం బావిలో తేలుతూ కనిపించింది. దాంతో అతడు ఈ విషయాన్ని గ్రామస్థులకు తెలిపాడు. ఇదిలా ఉండగా ఆత్మహత్యకు పాల్పడ్డ రామారావు సుమారు 9పేజీల సూసైడ్ నోట్ రాశాడని, అందులో తన ఆత్మహత్యకు కారణంగా చూపుతూ కొంత మంది పేర్లను ప్రస్తావించినట్లు తెలుస్తోంది. నేలకొండపల్లి పోలీసులు మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం నేలకొండపల్లి సీహెచ్‌సీకి తరలించారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పిచికారికి నిల్వచేసిన నీటిలో గడ్డి మందు

» తోటి రైతుల చర్యతో మూడు ఎకరాల్లో మాడిపోయిన మిర్చి పంట



మాడిపోయిన మిరపతోట (ఇన్‌సెట్‌లో రోదిస్తున్న రైతు శ్రీను)

చంద్రుగొండ, డిసెంబరు5 (ఆంధ్రజ్యోతి): సాగులో ఒకరికి ఒకరు సహకరించుకుంటూ ముందుకు సాగాల్సిన రైతులు, అసూయతో ఒకరి పంటను మరోకరు నాశనం చేయడం ఈ మధ్యకాలంలో అడపాదడపా చోటుచేసుకుంటుంది. ఇటువంటి సంఘటనే రావికంపాడులో చోటు చేసుకుంది. రావికంపాడు గ్రామానికి చెందిన రైతు ఇమ్మడి శ్రీనుకు చెందిన మూడు ఎకరాల మిర్చితోట గడ్డిమందుకు మాడిపోయింది. వివరాల్లోకి పోతే రైతు శ్రీను గ్రామ శివారులో మూడు ఎకరాలను కౌలుకు తీసుకొని మిర్చి పంటను సాగు చేశాడు. పంట పెట్టుబడికి రూ. 7లక్షల వరకు ఖర్చుచేశాడు. ఈ తరుణంలో గత ఆదివారం పంటకు క్రిమిసంహారక మందు పిచికారి చేసేందుకు కుమారుడితో కలసి శ్రీను డ్రమ్ముల్లో నీటిని నింపారు. ఇంతలో వర్షం రావడంతో పిచికారి నిలిపివేశారు. తిరిగి మర్నాడు(సోమవారం) ఉదయం డ్రమ్ముల్లో నిల్వచేసిన నీటిని ఉపయోగించి మూడు ఎకరాలకు మందు పిచికారి చేశారు. కాగా రెండు రోజులు గడిచే సరికి మూడు ఎకరాల్లోని మిర్చి ఎర్రబారి క్రమంగా మాడిపోతుంది. గడ్డి మందును నిల్వచేసిన నీటిలో కలపడంవల్లే మిర్చిపంట మాడిపోయిందని, ఈర్ష్యతోనే కొందరు నాతోటను నాశనం చేశారని రైతు శ్రీను విలపిస్తున్నాడు. ఇది ఇలా ఉండగా ఇప్పటికే కొందరిపై అనుమానంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు రైతు శ్రీను తెలిపాడు.

స్వయం ఉపాధికి అవసరమైన నైపుణ్యాభివృద్ధిలో శిక్షణలో మహిళా ప్రాంగణాలు ముఖ్య పాత్రను పోషిస్తున్నాయి. టైలరింగ్, ఇంగ్లీష్ టైపింగ్, డ్రైవింగ్, బ్యూటీషియన్, టైలరింగ్ తదితర కోర్సులతో పాటు స్థానికంగా డిమాండ్ ఉన్న కోర్సులను ఈ ప్రాంగణంలో అందిస్తున్నాయి. మహిళా ప్రాంగణంలో శిక్షణ తీసుకున్న పలువురు మహిళలు ఉపాధి పొందుతున్నారు.



శిక్షణా ధ్రువపత్రాలను అందిస్తున్న ప్రాంగణం అధికారి వేల్పుల విజేత

ఉపాధికి మార్గం

మహిళా ప్రాంగణం

» కుటుంబ పోషణనకు అండగా నిలుస్తున్న ప్రాంగణం » ఉపాధితో పాటు ఆత్మవిశ్వాసం పెంపునకు కృషి

ఖమ్మం ఖానాపురం హవేలీ, డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): దుర్గాబాయి పేరులో ఉన్న గొప్పదనాన్ని, ధైర్యాన్ని మహిళలకు అందిస్తూ వారి కాళ్లపై వారు నిలబడేలా తీర్చిదిద్దుతోంది ఖమ్మం నగరం టేకులపల్లిలోని మహిళా ప్రాంగణం. నాలుగెకరాల విస్తీర్ణంలో ఆహ్లాదకరమైన వాతావరణంలో మహిళలకు అనేక రకాల కోర్సులను అందుబాటులోకి తీసుకొచ్చి ఎందరికో ఉపాధి కల్పిస్తున్నది ఈ మహిళా ప్రాంగణం.

అందిస్తున్న కోర్సుల వివరాలు..

స్పోకెన్ ఇంగ్లీష్, టైపింగ్, ట్యాలీ, అకౌంటింగ్, కంప్యూటర్, డీసీఏ, డీటీపీ, డ్రైవింగ్, బ్యుటీషియన్ తదితర కోర్సులు అందుబాటులో ఉన్నాయి. మారుతున్న సాంకేతికతకు అనుకూలంగా మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలనే లక్ష్యంతో నిరుద్యోగ యువత, మహిళలకు నూతన కోర్సుల్లో శిక్షణ నిచ్చేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటి వరకు రెసిడెన్షియల్ కోర్సులకే పరమితమైన మహిళా ప్రాంగణంలో నాన్ రెసిడెన్షియల్ కోర్సుల్లో శిక్షణను ఇవ్వనున్నారు.

సెల్ఫ్ డిఫెన్స్‌లో శిక్షణ..

మహిళలకు, ఆడపిల్లలకు ఎటువంటి సంఘటనలు జరగకుండా తమను తాము కాపాడుకోవడంలో మహిళా ప్రాంగణం ఆధ్వర్యంలో సెల్ఫ్ డిఫెన్స్‌లో వేలాది మందికి శిక్షణ ఇచ్చారు. ఆత్మవిశ్వాసం పెంచుకోవడానికి నిపుణులతో కౌన్సెలింగ్‌ను నిర్వహిస్తున్నారు.

పేద కుటుంబాలకు ఆసరాగా...

కేవలం వృత్తి విద్యా కోర్సులే కాకుండా అంగన్‌వాడీ, ఆశా వర్కర్లకు కూడా వారి వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించే విధంగా జాబ్ కోర్స్, ఓరియెంటేషన్ శిక్షణను కొన్ని వేల మందికి అందించినది మహిళా ప్రాంగణం. ఇక్కడ వారి నైపుణ్యానికి తగ్గట్టుగా వివిధ రకాల శిక్షణాలలో వారికి శిక్షణ ఇచ్చి వారి కాళ్లపై వారు నిలబడేలా, ఆర్థికంగా సంపాదించుకునేలా, కుటుంబాన్ని నడిపించేలా అనేక మంది మహిళలకు ఉపాధి అందిస్తున్న సంస్థ మహిళా ప్రాంగణం. ఇక్కడ నేర్చుకునే వారికి ఉచిత భోజన వసతితో ఆహ్లాదకర వాతావరణంలో శిక్షణ కల్పించడం జరుగుతుంది.

రాష్ట్రస్థాయిలో ర్యాంకులు

మహిళా ప్రాంగణంలో చేరిన వారికి స్పోకెన్ ఇంగ్లీష్ అభ్యసనను నేర్పించడంతో పాటు, వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడానికి కరాటే, యోగాలలో కూడా శిక్షణను కల్పించడం జరుగుతుంది. ప్రస్తుతం పీఎం విశ్వకర్మ శిక్షణలో భాగంగా చేతి వృత్తి పనివారులకు కొత్త నైపుణ్యాలతో శిక్షణను కల్పిస్తూ ఉపాధికి కొత్త బాటలు వేస్తోంది. శిక్షణను ప్రారంభించిన తొలి సంవత్సరంలోనే రాష్ట్ర స్థాయి 2,3,4వ ర్యాంకులను, జిల్లా స్థాయిలో మొదటి పది ర్యాంకులను కైవసం చేసుకుని రికార్డు సృష్టించింది. జిల్లా ప్రాంగణ అధికారి వేల్పుల విజేత చేసిన కృషికి రాష్ట్ర స్థాయిలో ప్రశంశలు దక్కాయి...ఉత్తమ అధికారిగా పురస్కారాలు పొందారు.

20వేల మందికి పైగా శిక్షణ

తెలంగాణ రాష్ట్ర మహిళా సహకార అభివృద్ధి సంస్థ, మహిళా ప్రాంగణం ద్వారా పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన అండగా నిలుస్తోంది. ఇప్పటివరకు దాదాపు 20వేల మందికి పైగా వివిధ కోర్సులలో శిక్షణను అందించింది.

అన్ని రకాలుగా ఉపాధి అందిస్తున్నాం

● వేల్పుల విజేత, జిల్లా మహిళా ప్రాంగణం అధికారి



మహిళా ప్రాంగణం ద్వారా ఎంతోమంది అవసరంలో ఉన్న మహిళలకు వారికి ఇష్టమైన రంగంలో వృత్తివిద్యా కోర్సులు నేర్పించి వారి కాళ్లపై వాళ్లు నిలబడేలా చేయూతనిస్తున్న సంస్థ. మంత్రి దనసరి అనసూయ, (సీతక్క)ఆధ్వర్యంలో, మహిళా కార్పొరేషన్ చైర్ పర్సన్ బండ్రు శోభారాణి సలహాలు సూచనలతో, మా శాఖ మేనేజింగ్ డైరెక్టర్ కాంతి వెస్లీ సారథ్యంలో అనేక మంది మహిళలను మహిళా సాధికారత దిశగా అడుగులు వేయిస్తున్నాం. అందరు మహిళలు ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఇక్కడ శిక్షణలు తీసుకొని జీవితంలో స్థిరపడాలి. అందుకు తగ్గట్టుగానే శిక్షణను అందిస్తున్నాం. అవసరంలో ఉన్న ప్రతి మహిళకు అన్ని రకాల సహాయ సహకారాలు అందించడానికి మహిళా ప్రాంగణం అందుబాటులో ఉంటుంది.

టైలరింగ్ షాప్ పెట్టుకున్నాను..

● కుర్సా నాగమణి, దమ్మపేట



మహిళా ప్రాంగణంలో టైలరింగ్‌లో శిక్షణ తీసుకొని నేడు సొంతగా ఉపాధి పొందుతున్నాను. టైలరింగ్ షాప్ పెట్టుకుని నెలకు రూ.20 వేలకు పైగా సంపాది స్తున్నాను. నేడు సొంతంగా ఉపాధి పొందుతున్నాను.

కంప్యూటర్ విద్య నేర్చుకున్న..

ఈర్ల ఊర్మిళ, ఖమ్మం నగరం



మహిళా ప్రాంగణంలో కంప్యూటర్ కోర్స్ నేర్చుకున్నాను. నేడు టెక్ వేవ్ సంస్థలో ప్లానింగ్ ఎగ్జిక్యూటివ్‌గా పని చేస్తున్నాను. నాలాంటి ఎంతో మందికి మహిళాప్రాంగణం ఉపాధి చూపించింది.

బడిపంతుళ్ల డుమ్మా

» మీటింగ్ అని కొందరు, సెలవు అని మరి కొందరు పాఠశాలకు రాని వైనం



రాయిలంకలో ఉపాధ్యాయులు రాకపోవడంతో మూతబడిన పాఠశాల

ఆళ్లపల్లి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి) ఆళ్లపల్లి మండలంలోని పలు పాఠశాలలో గత నాలుగు రోజులుగా పలు పాఠశాలల్లో రోజు విడిచి రోజు ఉపాధ్యాయులు పాఠశాలకు రావడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఉపాధ్యాయులు వివిధ సమావేశాలని, వ్యక్తిగత కారణాలలో సెలవు అంటూ డుమ్మా కొడుతున్నారని, దీంతో విద్యార్థులు విద్యకు దూరం అవుతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. గురువారం మండల పరిధిలోని, రాయిలంక పాఠశాలకు గత మూడు రోజులుగా ఉపాధ్యాయులు రావడం లేదని గ్రామస్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు విలేకరులకు వివరించారు. కేవలం రాయిలంక ఒక్కటే కాదు, మండల వ్యాప్తంగా నాలుగు రోజులుగా ఆంధ్రజ్యోతి పరిశీలనలో పలు పాఠశాలలో ఉపాధ్యాయుల లేకుండా ఉండటం గుర్తించడం గమనార్హం. జిల్లా విద్యాశాఖ అధికారులు ఆళ్లపల్లి మండల విద్యా, ఉపాధ్యాయుల విధులపై దృష్టిపెట్టాలని మండల వాసులు కోరుతున్నారు.

డాబాపై నుంచి దూకిన వ్యక్తి..తీవ్ర గాయాలు

నేలకొండపల్లి, డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): డాబాపై నుంచి దూకి వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన మండల పరిధిలోని మంగ్రాజుపల్లిలో జరిగింది. మంగ్రాజుపల్లికి చెందిన జిల్లా ఉపేందర్ గురువారం ఉదయం తన ఇంటి డాబాపై నుంచి దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే తీవ్రంగా గాయపడిన అతడిని చికిత్స నిమిత్తం ఖమ్మం తరలించారు. ఉపేందర్ ఆత్మహత్యాయత్న వివరాలు తెలియరాలేదు.

మావోయిస్టు పార్టీ బీజీడీసీ సభ్యురాలి లొంగుబాటు



లొంగిపోయిన మావోయిస్టు దళ సభ్యురాలు మంగ్లీకి రివార్డు అందిస్తున్న ఎస్పీ రోహిత్‌రాజ్

కొత్తగూడెం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మావోయిస్టుపార్టీ బస్తర్ జిల్లా డివిజన్ కమిటీ సభ్యురాలు మంగ్లీ గురువారం భద్రాద్రి జిల్లా ఎస్పీ రోహిత్‌రాజ్ ఎదుట లొంగిపోయారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కొంత కాలంగా మావోయిస్టు పార్టీ ఆదివాసీ ప్రజల్లో ఆదరణ, నమ్మకం కోల్పోయి ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికే పరిమితమైందన్నారు. ఈ క్రమంలోనే మావోయిస్టు పార్టీ బస్తర్ జిల్లా డివిజన్ కమిటీ సభ్యురాలు మంగ్లీ మావోయిస్టు పార్టీని వీడి పోలీసుల ఎదుట లొంగిపోయిందన్నారు. మంగ్లీ 2003లో పామేడు ఎల్‌ఓసీ కమాండర్ సుక్కు ప్రోత్సాహంతో మావోయిస్టు పార్టీ చైతన్య నాట్య మండలి(సీఎన్ఎం)లో చేరి 2004 నుంచి 2007వరకు కిష్టారం ఎసీలో సావిత్రి డీవీసీఎంతో పనిచేసిందన్నారు. 2008లో 8వ ప్లటూన్‌కు బదిలీ అయ్యి నరేష్ ఆధ్వర్యంలో పని చేసిందన్నారు. 2009లో ఏసీఎం క్యాడర్‌గా ఎదిగి 2015వరకు పనిచేసిందన్నారు. తాజాగా పాలగూడెం, గొమ్ముగూడ, ఇట్లగూడ, మీనగట్టు, జలేరుగూడ గ్రామాల ఆర్‌పీసీ బాధ్యతలు చూడాలని పార్టీ ఆదేశించగా అందుకు తిరస్కరించిన ఆమె లొంగిపోవాలని నిర్ణయించుకుందన్నారు. లొంగిపోయి సాధారణ జీవనం గడపాలనుకునే మావోయిస్టు సభ్యులు తమ కుటుంబసభ్యులను కానీ జిల్లా పోలీసులను కానీ సంప్రదించాలని సూచించారు.

విద్యుత్ తీగలు తగిలి వ్యక్తి మృతి



వెంకటేశ్వర్లు

బూర్గంపాడు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): విద్యుత్ తీగలు తగిలి వ్యక్తి మృతి చెందిన సంఘటన ఉప్పుసాకలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం...బూర్గంపాడు మండల పరిధిలోని ఉప్పుసాక గ్రామపంచాయతీలో గల ఎస్టీ కాలనీకి చెందిన భూక్యా వెంకటేశ్వర్లు(28) గురువారం స్థానిక గ్రామపంచాయతీలో విధులకు హాజరయ్యాడు. గ్రామంలో బోరు మరమ్మతులు చేస్తుండగా ప్రమాదానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. పక్కనే ఉన్న మరో కార్మికుడు ప్రమాదం నుంచి బయట పడినట్లు తెలుస్తోంది. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఎస్ఐ రాజేష్, మండల విద్యుత్ ఏఈ హరిత పటేల్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని బంధువులు ఆందోళన చేపట్టడంతో ప్రభుత్వం నుంచి ఆర్థికసాయం అందే విధంగా కృషి చేస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కాగా మృతుడు తల్లి భద్రమ్మ ఉప్పుసాక గ్రామపంచాయతీలో గత రెండు సంవత్సరాలుగా విధులు నిర్వర్తించి ఇటీవల పదవీ విరమణ పొందగా... నాలుగు రోజుల నుంచి మృతుడు తాత్కలిక కార్మికుడిగా విధులకు హజరవుతున్నట్లు తెలుస్తోంది. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జడ్పీ మాజీ చైర్మన్ లింగాల అరెస్ట్

ఎర్రుపాలెం డిసెంబరు5 (ఆంధ్రజ్యోతి): ఎర్రుపాలెంలో సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో మౌలిక వసతులు పరిశీలనకు వెళ్లేందుకు ప్రయత్నించిన బీఆర్ఎస్ నాయకుడు జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్‌ను గురువారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆయనతో పాటు పలువురు మండల నాయకులను అరెస్ట్ చేసి, అనంతరం విడుదల చేశారు. ఈ సందర్భంగా కమల్‌రాజ్ మాట్లాడుతూ రాష్ట్రంలో గురుకులాల్లో నెలకొన్న పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని విద్యార్థుల భోజనశాలను, మౌలిక వసతులను పరిశీలించేందుకు వెళ్తున్న తమను పోలీసుల ద్వారా అడ్డుకోవడం కాంగ్రెస్ ప్రభుత్వం చాతకానితనానికి నిదర్శనమన్నారు. ముందస్తు అరెస్టులు ఎందుకు చేస్తున్నారని ప్రశ్నించారు. గేట్లకు తాళాలు వేసి పోలీసులను పహారా ఉంచారని, గురుకులాలలను కారాగారాలుగా మార్చారని లింగాల కమల్‌రాజ్ విమర్శించారు. ఈ కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

జాతీయ జూనియర్ అథ్లెటిక్స్ పోటీలకు

భద్రాద్రి క్రీడాకారుల ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న డీవైఎస్‌వో పరందామరెడ్డి

చుంచుపల్లి, డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): జాతీయ జూనియర్ అథ్లెటిక్స్ పోటీలకు భద్రాద్రి జిల్లాకు చెందిన ఎనిమిది మంది క్రీడాకారులు ఎంపికయ్యారు. అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఒరిస్సా రాష్ట్ర రాజధాని భువనేశ్వరలో ఈ నెల 11 నుంచి నిర్వహించనున్న పోటీలకు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులు అమ్రిన్, శ్రీ విద్య వేదశ్రీ, ఎం.సంగీత, ఎం.ఇందు, శ్రీతేజ, అభినవనాయక్, పి.కరుణ ఉన్నారు. జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రదర్శన కనబరిచి పతకం సాధించాలని డీవైఎస్‌వో పరందామరెడ్డి, సీనియర్ క్రీడాకారులు అభినందనలు తెలిపారు.

ధాన్యం అమ్ముకునేందుకు

అన్నదాతల పాట్లు

» తేమశాతం తగ్గకపోతుండటంతో ఆందోళన » సమస్యగా మారిన వాతావరణ ప్రభావం



ఐకేపీ కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతులు

ముదిగొండ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం శ్రమతో పండించిన పంటను అమ్ముకొనేందుకు రైతులకు అవస్థలు తప్పడం లేదు. ఒకపక్క తుఫాన్, మరోపక్క తేమశాతంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు కేంద్రాలను ఏర్పాటు చేసినప్పటికీ వాతావరణంలో మార్పులతో తేమశాతం తగ్గకపోవడంతో ధాన్యం అమ్ముకొనేందుకు అవస్థలు పడాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు.

ముదిగొండ మండలంలో ఈ ఏడాది ఖరీఫ్(వానాకాలం) సీజన్‌లో 14వేల ఎకరాల్లో రైతులు వరి పంట సాగుచేశారు. పంటను కొంత నూర్పిడి చేశారు. మరి కొందరు రైతులు పంటను నూర్పిడి చేయాల్సి ఉంది. మండలంలోని పలు గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో తొమ్మిది కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయగా 248మంది రైతుల నుంచి 2,500క్వింటాళ్ల ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేశారు. సొసైటీ ఆధ్వర్యంలో ఆరు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయగా 60మంది రైతుల నుంచి 2,800క్వింటాళ్ల ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు 20రోజుల క్రితమే ప్రారంభమయ్యాయి.

తేమతో నిమిత్తం లేకుండా కొనాలని అన్నదాతల వినతి

మరికొన్ని గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తేమశాతం ఎక్కువగా ఉండటంతో కొనుగోళ్ల ప్రారంభం కాలేదు. కానీ రైతులు కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చిన ధాన్యాన్ని ఆరబెట్టినప్పటికీ వాతావరణంలో మార్పుల వల్ల తేమశాతం తగ్గడం లేదు. దీంతో మరోపక్క తుఫాన్ ప్రభావంతో చిరుజల్లులు పడుతుండటంతో ఆరబెట్టిన ధాన్యం కొంతమేర తడవడం, పట్టాలు కప్పినప్పటికీ నిత్యం ఆరబెట్టి ధాన్యాన్ని కాపాడుకోవడానికే రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. తుఫాన్ ప్రభావంతో వర్షాలు కురిస్తే ధాన్యం తడిసి నష్టపోతామని రైతులు ఆందోళన చెందుతున్నారు. వారంరోజులుగా వరిని కోసి ఆరబెట్టినప్పటికీ తేమశాతం రాకపోవడంతోపాటు పట్టాల కిరాయికి అధిక వ్యయం అవుతుండటంతో ఇబ్బందులు పడుతున్నామని ధాన్యాన్ని తేమశాతం లేకుండా కొనుగోలు చేసి తమను ఆదుకోవాలని కోరుతున్నారు.

పట్టాల కిరాయి ఖర్చు భారమవుతోంది..

● వల్లాల లింగరాజు, రైతు, ఎడవల్లి



రెండెకరాల్లో వరి సాగుచేశాను. ధాన్యాన్ని తీసుకువచ్చి ఐకేపీ కొనుగోలు కేంద్రంలో వారంరోజులుగా ఆరబెడుతున్నప్పటికీ ఒక పక్క తుఫాన్ ప్రభావంతో వాతావరణంలో మార్పుల కారణంగా తేమశాతం తగ్గడం లేదు. తేమశాతం తగ్గకపోవడంతో పట్టాల కిరాయికి అధిక వ్యయం అవుతుంది. తేమశాతం ఎక్కువగా ఉందనే కారణంతో ఐకేపీ నిర్వాహకులు ధాన్యాన్ని కొనుగోలు చేయడం లేదు. వర్షాలు కురిస్తే ధాన్యం తడిసి పాడైపోయే ప్రమాదముంది. తేమశాతం లేకుండా ఉన్న పరిస్థితులకనుగుణంగా ధాన్యాన్ని కొనుగోలు చేయాలి.

నాలుగు ఉద్యోగాలకు ఎంపిక



ఏన్కూరు, డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): ఏన్కూరు మండలం భగవాన్‌నాయక్‌తండా గ్రామానికి చెందిన గిరిజన విద్యార్థిని బానోతు స్పందన నాలుగు ఉద్యోగాలు సాధించింది. 2024 గురుకుల ఫలితాల్లో టీజీటీ, పీజీటీ, గురుకుల జూనియర్ లెక్చరర్‌గా ఎంపికై మూడు ఉద్యోగాలు సాధించింది. ప్రస్తుతం ఖమ్మం రఘునాథపాలెం మహత్మా జ్యోతిరావుపూలే జూనియర్ కళాశాలలో లెక్చరర్‌గా పనిచేస్తుంది. తాజాగా విడుదలైన జనరల్ ప్రభుత్వ లెక్చరర్ పోస్టుల్లో జువాలజీ లెక్చరర్ ఉద్యోగానికి ఎంపికైంది. ఈసందర్భంగా మండల ప్రజలు స్పందనను అభినందిస్తున్నారు.

రేపు ఉమ్మడి జిల్లా క్రికెట్ జట్టు ఎంపికలు

ఖమ్మం స్పోర్ట్స్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): జిల్లా క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) ఆధ్వర్యంలో శనివారం నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో అండర్- 14 ఉమ్మడి జిల్లా క్రికెట్ జట్టును ఎంపిక చేయనున్నట్లు జిల్లా క్రికెట్ సంఘం బాధ్యులు ప్రకటించారు. ఆసక్తి గల క్రీడాకారులు ఉదయం 10 గంటలకల్లా స్టేడియానికి చేరుకోవాలని సూచించారు.



ఆంధ్రజ్యోతి KHAMMAM CITY
● ఖమ్మం ● రఘునాథపాలెం
● ఖమ్మం రూరల్
● తిరుమలాయపాలెం
● కూసుమంచి
● నేలకొండపల్లి ● కామేపల్లి
ఖమ్మం సిటీ
ZONE 6
శుక్రవారం 6 డిసెంబరు 2024

బంగ్లాదేశ్ హిందువులపై దాడులను నిరసించాలి

ఖమ్మంసంక్షేమవిభాగం,డిసెంబరు5: బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులను పౌర సమాజం నిరసించాలని సీపీఐ(ఎంఎల్)మార్క్సిస్ట్ లెనిన్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆవుల అశోక్ పిలుపునిచ్చారు. గురువారం ఖమ్మం రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో అశోక్ మాట్లాడారు. విద్యార్థుల తిరుగుబాటు అనంతరం మత చాందసవాదులు రాజకీయ ఆధిపత్యం కారణంగా అరాచక వాతావరణానికి పాల్పడ్డారని ఆరోపించారు. మత హింస పెరుగుదల పాలకవర్గాల వైఫల్యాన్ని పట్టిచూపుతుందన్నారు. బలవంతపు మతమార్పుడులే గొడవలకు కారణంగా ఆవుల అశోక్ తెలిపారు. నాయకులు ఝాన్సీ, కే శ్రీను, లక్ష్మణ్, రాకేష్, ప్రేమ్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

రైతుబజార్ కూరగాయల ధరలు

(కిలో ఒక్కంటికి రూపాయల్లో)

టమాటా	50 రూ.
వంకాయ	24
గుత్తి వంకాయ	28
బీరకాయ	48
పచ్చిమిర్చి	28
కాకరకాయ	34
బెండకాయ	20
పొట్లకాయ	40
దోసకాయ	28-44
చిక్కుడు	48
నాటుచిక్కుడు	68
గోరుచిక్కుడు	28
క్యాబేజీ	28
దొండ	34-40
సొరకాయ	20
క్యారెట్	64
క్యాప్సికం	58
ఆలుగడ్డ	38
ఉల్లిగడ్డ	60-70
కోడిగుడ్ల ట్రే (30 గుడ్లు)	195
కొత్తిమీర కట్ట	40

- ఆంధ్రజ్యోతి, ఖమ్మం మార్కెట్

CINEMA సినిమా

నగరంలో చిత్రాలు..

వినోద:	లక్కీభాస్కర్
శ్రీనివాస:	అమరన్
సాయిరాం:	మెకానిక్‌రాకీ
కేపీఎస్:	పుష్ప 2
తిరుమల:	పుష్ప 2
సినీ గెలాక్సీ:	పుష్ప 2

శ్మశాన వాటిక
ఆక్రమణపై చర్యలేవి?

టేకులపల్లిలో సర్వేలో తీవ్రజాప్యంతో ఇబ్బందులు



టేకులపల్లిలోని శ్మశానవాటిక

ఖమ్మంటౌన్, డిసెంబరు5 (ఆంధ్రజ్యోతి): అక్రమార్కులు దేనిని వదలటం లేదు. శ్మశాన వాటికను సైతం ఆక్రమిస్తున్నా అధికారులు పట్టించుకోవటం లేదనే విమర్శలు వస్తున్నాయి. ఇందుకు ఉదాహరణగా టేకులపల్లి శ్మశానవాటిక.. ఈ శ్మశాన వాటికపై కన్నుపడ్డ అక్రమార్కులు ఫెన్సింగ్‌ను వెనక్కి జరిపి, సదరు స్థలాన్ని ఆక్రమించుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కాగా గతంలో శ్మశానవాటికకు ఫెన్సింగ్ లేదని, అక్రమార్కులు ఏర్పాటు చేశారని నగరపాలకసంస్థ అధికారులకు ఫిర్యాదులు అందాయి. అయితే సర్వే చేయాలని వారు రెవెన్యూ అధికారులకు లేఖ రాశారు. కాగా సర్వేలో జాప్యం జరగటంతో అక్రమార్కులు మరీ రెచ్చిపోతున్నారనే విమర్శలు ఉన్నాయి. సదరు స్థలం రెవెన్యూ పరిధిలో లేకుండా ఎన్నెస్పీ, ఆర్&బీ శాఖల పరిధిలో ఉండటంతో జాయింట్ సర్వేలో కాలయాపన జరుగుతోంది.

నాలుగు డివిజన్లకు అందుబాటులో..

టేకులపల్లి శ్మశానవాటిక నాలుగు డివిజన్ల పరిధిలోని ప్రజలకు అందుబాటులో ఉంది. మృతదేహాలకు ఇక్కడే అంత్యక్రియలు నిర్వహిస్తారు. కాగా శ్మశానవాటిక కబ్జా కావటంతో అంత్యక్రియలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఫెన్సింగ్ ఇవతల అంత్యక్రియలు నిర్వహించకుండా అక్రమార్కులు అడ్డుకుంటున్నారు. దీంతో తరచూ ఘర్షణలు జరుగుతున్నాయి. శ్మశానవాటికకు అధికారులు వేసిన ఫెన్సింగ్‌ను ముందుకు జరిపి. సదరు స్థలాన్ని ఆక్రమించటంతో ఈ పరిస్థితి నెలకొంది. ప్రజలకు ఉపయోగపడే శ్మశానవాటికను ఆక్రమించటం పట్ల ప్రజలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సర్వే నిర్వహిస్తాం..
అర్బన్ తహసీల్దార్ రవికుమార్

టేకులపల్లి శ్మశానవాటిక స్థలాన్ని సర్వే చేసి ఆక్రమణలను తొలగిస్తామని అర్బన్ తహసీల్దార్ రవికుమార్ తెలిపారు. అక్కడి స్థలం ఎన్నెస్పీ, ఆర్&బీ శాఖల పరిధిలో ఉందన్నారు. సదరు అధికారులతో మాట్లాడి వారితో కలిసి సర్వే చేయిస్తామన్నారు. శ్మశానవాటికకు కేటాయించిన స్థలమా? పట్టా భూమా? అన్న విషయం జాయింట్ సర్వే ద్వారా తేలుతుందన్నారు.అనంతరం చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ తెలిపారు.

కొత్త పంచాయతీలకు భవనాలు కరువు

- నిధుల్లేక నిర్మాణానికి నోచుకోని వైనం
- పట్టించుకోని ప్రభుత్వం



బాలాజీనగర్‌తండాలో పంచాయతీ అద్దెభవనం

తిరుమలాయపాలెం, డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): గ్రామీణప్రాంతాల ప్రజలకు మెరుగైన సేవలందించాలనే లక్ష్యంతో గతంలో నూతన పంచాయతీలు ఏర్పాటు చేశారు. కాగా వీటికి పక్కాభవనాలు నిర్మించకపోవడంతో అందబాటులో ఉన్న ప్రభుత్వపాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, అద్దెభవనాల్లో పంచాయతీల పాలన కొనసాగిస్తున్నారు. ఐదేళ్లుగా రేపుమాపు అంటూ కాలం వెళ్లదీస్తున్న ప్రభుత్వం.. అద్దెభవనాల్లో అయినా మౌలిక సదుపాయాలు కలిపించడం లేదు. మండలంలో 40 గ్రామ పంచాయతీలుండగా 12 అద్దె భవనాల్లో పాలన సాగుతుంది. సరైన సౌకర్యాలు లేక పంచాయతీ పాలన అస్తవ్యస్థంగా మారింది. గత సర్పంచుల పదవులు కాలపరిమితి ముగిసినా, కొత్తపంచాయతీలకు భవనాలు నిర్మించలేదు. మండలంలోని మేకల తండా, సుద్దవాగుతండా,ఏనుకుంటతండా,ఏలువారిగూడెం, బాలాజీ నగర్‌తండా, పడమటి తండా,కేశ్వపురం, జోగులపాడుతో పాటు మరి కొన్ని పంచాయతీల్లో భవనవాలు లేవు. దీంతో అనేక గ్రామాలుకొత్త పంచాయతీలు ఏర్పడినప్పటికి శాశ్వతభవనాలు లేవు.

అద్దెభవనాల్లో పాలన....

మండలంలోని కొత్తగా ఏర్పడిన పంచాయతీలకు ఇప్పటి వరకు సొంత భవనాలునిర్మించలేదు. దీంతో అద్దెభవనాల్లో అరకొర వసతులతో పాలన సాగుతుంది. సమావేశాలు నిర్వహించాలన్నా సరైన గదులు లేక బయట సమావేశాలు నిర్వహించాల్సి వస్తుంది. కొన్ని భవనాలు వర్షం వస్తే అందులో ఉండే పరిస్థితిలేదు. కార్యాలయ రికార్డులు, ఇతర సామగ్రిని భద్రపరుచుకోవడానికి నానా ఇబ్బందులు పడుతున్నారు.

వేధిస్తున్న నిధుల కొరత

తక్కువ జనాభాతో ఏర్పాటయిన కొత్త పంచాయతీకుల నిధుల కొరత వేధిస్తోంది. ఆర్థిక సంఘం నిధులు జనాబా ప్రాతిపదికన కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు కేటాయించడంతో తక్కువ జనాబా ఉన్న పంచాయతీలకు కష్టాలు తప్పడంలేదు. పన్నుల వసూలు అంతంతమాత్రంగా ఉండడంతో విద్యుత్‌బిల్లులు,సిబ్బంది వేతనాలు, ట్రాక్టర్ల కిస్తీలు చెల్లించలేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు.

మహాలక్ష్మి పథకం మహిళలకు వరం

డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహర



మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్

ఖమ్మంఖానాపురంహవేలి, డిసెంబరు5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకం మహిళలకు వరమని డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహర పేర్కొన్నారు. ప్రజాపాలన-ప్రజా విజయోత్సవాల్లో భాగంగా ఆర్టీసీ ఖమ్మం రీజియన్ పరిధిలో గురువారం ఖమ్మం కొత్త బస్టాండ్‌లో ప్రజావిజయోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా డిప్యూటీ మేయర్ హాజరై మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 114.34కోట్ల మంది మహిళలు ఉచిత ప్రయాణాన్ని ఉపయోగించుకొని రూ.3856.40 కోట్ల రూపాయలు ఆదా చేశారన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 4.28 కోట్ల మంది మహిళలు ప్రయాణించి రూ.208 కోట్ల రూపాయలు ఆదా చేశారు అని అన్నారు. మహాలక్ష్మి పథకం అమల్లోకి వచ్చిన తర్వాత ఆర్టీసీ బస్సుల్లో మహిళా ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరిగిందన్నారు. అన్ని బస్ స్టేషన్లల్లో ఉచిత టాయిలెట్ల సదుపాయం మహిళల కోసం సౌకర్యాల కల్పించామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎం సరిరామ్, ఖమ్మం డిపో మేనేజర్ దినేష్ కుమార్, మధిర డిపో మేనేజర్ శంకర్‌రావు, పర్సనల్ మేనేజర్ జీఎస్ నారాయణ, అకౌంట్ ఆఫీసర్ బాలస్వామి, మెడికల్ ఆఫీసర్ సాయి సుష్మ, అసిస్టెంట్ మేనేజర్లు, రామయ్య, శ్రీనివాస్, ప్రవీణ్, విజిలెన్స్ పాల్గొన్నారు.

విద్యా సామర్థ్యాలు పెంచాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న నారాయణ

రఘునాథపాలెం, డిసెంబరు5: ప్రాథమిక విద్యాస్థాయిలోనే విద్యార్థులకు సామర్థ్యాలు పెరగాలని, 1నుంచి 5వ తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా అకాడమిక్ మోనిటరింగ్ అధికారి కేశవపట్నం రవి, డీసీఈబీ కార్యదర్శి నారాయణ పేర్కొన్నారు. గురువారం రఘునాథపాలెం మండలం చింతగుర్తి పాఠశాలను వారు తనిఖీ చేశారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలు, పఠనాశక్తిని స్వయంగా పరీక్షించి తెలుసుకున్నారు.

సహిత విద్యను బలోపేతం చేయాలి

ఖమ్మంఖానాపురంహవేలి, డిసెంబరు5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో తొలిసారి స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ పోస్టులను ఏర్పాటు చేయడం ద్వారా సహిత విద్య కార్యక్రమాలను బలోపేతం చేయటానికి అవకాశం ఏర్పడిందని జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖర శర్మ అన్నారు. గురువారం నగరంలోని నయబజార్ ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన సహిత విద్య ఉపాధ్యాయులకు అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దివ్యాంగ విద్యార్థులకు ప్రత్యేక విద్యా ప్రణాళికలను అమలు చేయటం ద్వారా ఉన్నతి స్థితికి తీసుకురావటం సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమాలను బలోపేతం చేయటానికి సహిత విద్యా ఉపాధ్యాయులు ఐఈఆర్‌పీలతో కలిసి సమన్వయంతో పనిచేయాలని అన్నారు.

మాయమాటలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది

- బీజేపీ జాతీయ నాయకుడు పొంగులేటి సుధాకర్ రెడ్డి





ర్యాలీని ప్రారంభిస్తున్న పొంగులేటి, నేలకొండపల్లిలో ఛార్జిషీట్ పత్రాల విడుదల

ఖమ్మంబైపాస్‌రోడ్డు, డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): మాయమాటలతో ప్రజలను మోసం చేసి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, ఇప్పుడు ఆరు గ్యారంటీలు పోయి 66మోసాలకు పాల్పడిందని బీజేపీ జాతీయ నాయకుడు, తమిళనాడు సహఇన్‌చార్జ్ పొంగులేటి సుధాకర్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ నగరంలో గురువారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈర్యాలీని జెండాఊపి ప్రారంభించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి సంవత్సరం పూర్తైయినా కూడా హామీలు నెరవెర్చడంలేదని, బీఆరెస్, కాంగ్రెస్ రెండు ఒక్కటేనని అన్నారు.ఈ కార్యక్రమంలో కిసాన్‌మోర్చా రాష్ట్రఅధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, అసెంబ్లీ కన్వీనర్ అల్లిక అంజయ్య, పుల్లారావు, కార్పొరేటర్ దొంగల సత్యనారాయణ, శ్యామ్‌రాథోడ్, మందా సరస్వతి, డాక్టర్ శీలం పాపారావు, కుమిలి శ్రీనివాస్, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆరుఅబద్ధాలు.. 66మోసాలు

నేలకొండపల్లి: కాంగ్రెస్ ప్రభుత్వం పాలన ఆరు అబద్దాలు.. 66 మోసాలు తప్ప అభివృద్ధి శూన్యమని బీజేపీ జిల్లాప్రధాన కార్యదర్శి నున్నా రవికుమార్ తీవ్రంగా విమర్శించారు. గురువారం నేలకొండపల్లిలో బీజేపీ కాంగ్రెస్ ప్రభుత్వంపై విడుదల చేసిన చార్జిషీట్‌ను రవికుమార్ నేలకొండపల్లిలో విడుదల చేశారు. అనంతరం రవికుమార్ మాట్లాడుతూ ఎన్నికల్లో కాంగ్రెస్ చేసిన మోసపూరిత వాగ్దానాలపై ప్రజలను చైతన్యం చేయాలని కార్యకర్తలను కోరారు. నియోజకవర్గ శాసనసభ్యుడు, మంత్రి శ్రీనివాస రెడ్డి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయటం లేదని విమర్శించారు. నియోజకవర్గానికిచ్చిన హామీలను అమలు చేయటం లేదని ఆక్షేపించారు. కార్యక్రమంలో భవనాశి దుర్గారావు, మన్నె కృష్ణారావు, పాగర్తి సుధాకర్, షేక్. షర్ఫుద్దీన్, ఇస్లావత్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వరికి మద్దతు ధర

తిరుమలాయపాలెం, డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): వరి పంటకు ప్రభుత్వం మద్దతు ధర కలిపిస్తుందని ఏడీఏ బి.సరిత పేర్కొన్నారు. గురువారం మండలంలోని జల్లేపల్లి, దమ్మాయిగూడెం, బీరోలు తదితర గ్రామాల్లో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ధాన్య కొనుగోలు కేంద్రాల్లో పంటలు అమ్ముకుని మద్దతు ధర పొందాలన్నారు. క్వింటాకు ప్రభుత్వం అదనంగా రూ.500బోనస్ ఇస్తుందన్నారు. అలాగే దమ్మాయిగూడెం, బీరోలు, రాజారం గ్రామాల్లో ఎరువులు, విత్తనాల దుకాణాలు పరిశీలించారు. రికార్డులు తనిఖీ చేశారు. ఎరువుల, విత్తనాలు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం బీరోలు రైతువేదికలో పంట అవశేషాలను కాల్చడం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. పోషకాలు, సేంద్రియ పదార్థాలు బూడిదై భూమి సారం కోల్పోతుందన్నారు. ఈకార్యక్రమంలో ఏవో సీతారాంరెడ్డి, ఏఈవోలు నవనీత, సౌమ్య, లంక రమేష్ పాల్గొన్నారు.

8న 'ఓహో.. మేఘమాల'

ఖమ్మంసాంస్కృతికండి,సెంబరు5(ఆంధ్రజ్యోతి): ఈనెల8 సాయంత్రం ఖమ్మం భక్తరామదాసు కళాక్షేత్రంలో ఓహో మేఘమాల పేరుతో అర్ధశత గానార్చన నిర్వహించబోతున్నట్లు కార్యక్రమ నిర్వాహకులు కె. మాధవరావు, వివి రెడ్డి, గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అమర గాయకుడు ఘంటసాల 102వ జయంతి సందర్భంగా స్వర సుధ మ్యూజిక్ యూనిట్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

గరికపాటి సోదరులకు మోహన్‌రావు పరామర్శ

ఖమ్మంరూరల్, డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బారుగూడెంలోని శ్రీసిటి చైర్మన్ గరికపాటి వెంకట్రావు, ఆంజనేయప్రసాద్ సోదరుల తండ్రి గరికపాటి రాఘవయ్య కొద్ది రోజులక్రితం మృతిచెందారు. మాజీ ఎంపీ గరికపాటి మోహన్‌రావు, మంత్రితుమ్మల తనయుడు తుమ్మల యుగంధర్ గురువారం గరికపాటి సోదరులను పరామర్శించారు.

7నుంచి సీఎం కప్‌పోటీలు

తిరుమలాయపాలెం,డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): మండంలోని ప్రభుత్వ పాఠశాలల్లో రేపటినుంచి మూడురోజులు సీఎంకప్ క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ రామకృష్ణ తెలిపారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో పంయతీ కార్యదర్శులు,అధికారులతో సమావేశం నిర్వహించారుక. కాకరవాయి,బీరోలు, జల్లేపల్లి, తిరుమలాయపాలెం ఉన్నత పాఠశాలల్లో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

నేటినుంచి సుబ్రహ్మణ్య షష్ఠి పూజలు

మధిరటౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మధిర బంజారా కాలనీ శ్రీవల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్య స్వామి దేవాలయంలో శుక్రవారం నుంచి సుబ్రహ్మణ్య షష్ఠి సందర్భంగా వరసగా 12వ సంవత్సరం కూడా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్టు ఆలయ ధర్మకర్త తెలిపారు.

ఘనంగా జేఎన్‌టీయూ ఫ్రెషర్స్ డే



ఖమ్మంఖానాపురంహవేలి,డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): పాలేరు నియోజకవర్గంలోని మద్దులపల్లిలోగల పాలేరు జేఎన్‌టీయూహెచ్ కళాశాలలో గురువారం ఫ్రెషర్స్‌డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. పరిచయ్ పేరుతో నిర్వహించిన ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ రమేష్ జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. విద్యార్థులకు భవిష్యత్తులో ఎలాంటి కోర్సుల్లో ప్రావీణ్యం పొందాలి, విద్యా ప్రణాళికలు, పాఠ్యేతర కార్యక్రమాలపై వివరించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్

కేఎంసీ బిల్ కలెక్టర్ల ఫోన్ నెంబర్లు

బిల్ కలెక్టర్ పేరు	రెవెన్యూ డివిజన్	ఫోన్ నెంబర్
ఎం. శ్రీను	1	94405 45184
యు. ఉపేందర్‌రావు	2	97019 58195
సీహెచ్ వెంకటేశ్వర్లు	3	99484 87342
జోహ్నాగోష్	3	93910 55901
వీ. వస్రాం	4	97053 53128
వీరబాబు	5(1,6)	98488 81129
శ్రీదేవి	5(7)	96661 31260
అవినాష్	5,7	63011 34453
డీ. నాగరాజు	8	98491 86761
కే. ఉప్పలి	9	95538 73186
టీ. ముత్తయ్య	11(1,7)	76750 92606
టీ. పల్లవి	11(8,9)	99510 53054
ఎస్ వెంకటేశ్వర్లు	10,11(12)	98667 41175
ఏ. రమేశ్	12	95533 55930
డీ. అప్పయ్య	13,14	86888 77412
సీహెచ్ రాములు	14	96523 14210
బీ. సైదులు	15(1,5)	98663 04918
డీ మల్లయ్య	15(6,7,8)	95429 90630
లింగరాజు	15(9)	96664 40310
సురేందర్	15(10,15)	99890 04290
ఏ. శ్రీనివాసరావు	15(16,17)	76750 50834
వై. సాయిరామకృష్ణ	15(18,19)	70754 20494
మాధవరావు	15(20,21)	90109 26224
టీ. రామారావు	16	63014 05221
వీ. వెంకన్న	17,18,19	99085 84502
ఎం. నాగరాజు	20	94943 16361

ఇసుక టిప్పర్లు పట్టివేత

ఖమ్మంక్రైం డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఆంధ్ర నుంచి ఖమ్మం తరలిస్తున్న మూడు ఇసుక టిప్పర్లను ఖానాపురంహవేలి పోలీసులు గురువారం రాత్రి పట్టుకున్నారు. ఖమ్మానికి చెందిన మల్లెంపాటి హర్షవర్ధన్, తనికెళ్లకు చెందిన దరావత్ తిరుమలరావు, గొల్లపుడికి చెందిన బాణాల వెంకటేశ్వర్లుకు చెందిన లారీల్లో ఖమ్మానికి చెందిన సాయి ఆంధ్ర నుంచి ఇసుకను తరలిస్తున్నారు. దీంతో ఖానాపురంహవేలి పోలీసులు తనిఖీలో ఉండగా లారీలు పట్టుబడ్డాయి.

అనాథ మృతదేహాలకు అంత్యక్రియలు

ఖమ్మంఖానాపురంహవేలి,డిసెంబరు5 (ఆంధ్రజ్యోతి): నగరంలోని అన్నం సేవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం రెండు అనాథ మృతదేహాలకు అంత్యక్రియలు నిర్వహించారు. ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఎవ్వరు రానందున ప్రభుత్వ వైద్యశాల సిబ్బంది, ఓపీ పోలీసుల సమక్షంలో మృతదేహాలను స్వాధీన పరుచుకొని నగరంలోని బల్లేపల్లి వైకుంఠధామంలో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అన్నం శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్య ఉపకేంద్రం తనిఖీ



మొక్క నాటుతున్న డీఎంహెచ్‌వో

రఘునాథపాలెం, డిసెంబరు5: సంపూర్ణ ఆరోగ్య దిశగా ఖమ్మం జిల్లా ముందుకు వెళ్తుందని జిల్లా వైద్యాధికారి మాలతి పేర్కొన్నారు. గురువారం వీ-వెంకటాయపాలెం ఆరోగ్య ఉపకేంద్రాన్ని తనిఖీ చేశారు. స్థానికంగా ప్రజలకు అందుతున్న వైద్యసేవలను అడిగి తెలుసుకున్నారు. కుష్టు వ్యాధి గుర్తింపు సర్వే తీరును తెలుసుకున్నారు. వైద్యఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ నర్సింహా జన్మదినోత్సవం సందర్భంగా వీవీపాలెం ఆరోగ్య ఉపకేంద్రంలో డీఎంహెచ్‌వో కళావతిబాయి మొక్కలు నాటారు. డీపీవో దుర్గ, డీఐవో చందునాయక్, ఎమ్ఎల్‌హెచ్‌పీ మౌనిక, సీహెచ్‌వో రమాదేవి, ఆరోగ్య పర్యవేక్షకులు తాళ్లూరి శ్రీకాంత్, పద్మ, ఏఎన్ఎంలు పుష్పావతి, పర్వీన్ పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలి

ఎస్సీ కార్పొరేషన్ ఈడీ



వంటలను పరిశీలిస్తున్న ఈడీ నవీన్‌బాబు

కొణిజర్ల, డిసెంబరు5 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం నాణ్యతతో ఉండాలని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ నవీన్‌బాబు సూచించారు. గురువారం మండలంలోని పెద్దగోపతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. విద్యార్థులకు వడ్డించే అన్నం, వంటకాలను, పాఠశాలలోని మౌలికవసతులను పరిశీలించారు. భోజనం విషయంలో నిర్లక్ష్యం చేయవద్దన్నారు. పాఠశాలలో తాగు నీరు వసతిని, మూత్రశాలలను పరిశీలించారు.

విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నతస్థాయికి ఎదగాలి

బోనకల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నతస్థాయికి ఎదగాలని ఎస్ఐ మధుబాబు సూచించారు. మండలంలోని ఆళ్లపాడు ఉన్నత పాఠశాలలో గురువారం పది విద్యార్థులకు అల్పాహారం అందించేందుకు బత్తినేని ట్రస్టు రూ. 20వేలు, శ్రీనిధి కళాశాల ప్రిన్సిపాల్ అనిల్ రూ.10వేలు, పూర్వవిద్యార్థి పారా హర్షవర్దన్ రూ.10వేలువితరణగా ఇచ్చారు. ఎస్ఐ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతం కోసం దాతల చేయుత దోహద పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం శ్రీదేవి, మరీదు బరకయ్య, తోటకూర వెంకటేశ్వరరావు, పారా శ్రీను, కందుల పాపారావు, బుంగా రాములు పాల్గొన్నారు.

కబడ్డీ పోటీల్లో బీసీ హాస్టల్ విద్యార్థుల ప్రతిభ

మధిర, డిసెంబరు5 (ఆంధ్రజ్యోతి): బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఖమ్మంలో బుధవారం జరిగిన పోటీలలో జిల్లా స్థాయిలో జూనియర్స్ కబాడీ విభాగంలో మధిర బీసీ హాస్టల్ విద్యార్థులు ప్రథమ బహుమతి గెలుపొందారు. విజేతలకు కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ బుధవారం రాత్రి బహుమతులు అందజేశారు.



ఆంధ్రజ్యోతి

● మధిర, ఎర్రుపాలెం, బోనకల్, చింతకాని, ముదిగొండ
● వైరా, కొణిజర్ల, కారేపల్లి, ఏన్కూరు , జూలూరుపాడు
● సత్తుపల్లి, కల్లూరు, తల్లాడ, వేంసూరు, పెనుబల్లి

6

ZONE
వైరా-మధిర
సత్తుపల్లి

WYRA, MADHIRA, SATHUPALLY

శుక్రవారం 6 డిసెంబరు 2024

నేటినుంచి సుబ్రహ్మణ్య షష్ఠి పూజలు

మధిరటౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మధిర బంజారా కాలనీ శ్రీవల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్య స్వామి దేవాలయంలో శుక్రవారం నుంచి సుబ్రహ్మణ్య షష్ఠి సందర్భంగా వరసగా 12వ సంవత్సరం కూడాప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్టు ఆలయ ధర్మకర్త కోనేరు లీలాశంకర్, ఆలమ నిర్వహణ కమిటీ చైర్మన్ గుర్రం ప్రమీల తెలిపారు. శుక్రవారం శుద్ధషష్ఠి సందర్భంగా సాయంత్రం 6 గంటలకు సంప్రోక్షణ, అంకురార్పణ ఇతర పూజా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. శనివారం శ్రీవల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్య స్వామి కళ్యాణం రంగరంగ వైభవంగా నిర్వహిస్తామని, అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

వైరా, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): వైరా టౌన్-1ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏఈ పి.సుందర్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. సైదులుస్వామి గుడి, ఎస్సీ వెల్ఫేర్ కళాశాల, కమ్మవారి కల్యాణమండపం పరిసర ప్రాంతాల్లో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30గంటల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందన్నారు.

చదువుకు డబ్బు ఆటంకం కాదు

తల్లాడ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): చదువుకు డబ్బు ఆటంకం కాదని డబ్బు లేకపోయినప్పటికీ ప్రణాళికాబద్ధంగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించిన వారు ఉన్నారని వ్యక్తిత్వ వికాస నిపుణుడు మహ్మద్ పాషా అన్నారు. గురువారం తల్లాడ మం డలం నూతనకల్ జడ్పీఉన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు ప్రేరణ కార్యక్రమా న్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చదువుతో పేదరికాన్ని జయించి మాజీ రాష్ట్రపతి అబ్దుల్‌కలాం ఆదర్శంగా నిలిచారని తెలిపారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సహకారాలతో విద్యార్థులు తమ లక్ష్యాల ను నెరవేర్చుకోవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో హైస్కూల్ హెచ్ఎం రమేష్ పాల్గొన్నారు.

కులాంతర వివాహాలకు రక్షణ చట్టం చేయాలి: ఐద్వా

పెనుబల్లి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కులాంతర వివాహాలకు చట్టబద్ధత కల్పిస్తూ రక్షణ చట్టాన్ని ఏర్పాటుచేయాలని ఐద్వా మండల కార్యదర్శి మిట్టపల్లి నాగమణి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం పెనుబల్లిలో ఐద్వా ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండల రాయప్రోలు గ్రామానికి చెందిన కానిస్టేబుల్ కొంగరి నాగమణిని దళిత యువకుడు శ్రీకాంత్ వివాహం చేసుకున్నాడని, ఆమె సోదరుడు నాగమణిని కిరాతకంగా హత్యచేశాడని, ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం రక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐద్వా నాయకురాళ్లు మాదాసు నాగేశ్వరి, గోళ్ల పద్మప్రియా, పిట్టల లక్ష్మీ, నల్ల భారతి, సరస్వతీ, రమణ పాల్గొన్నారు.

భగీరథ నీరు సురక్షితం

బోనకల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మిషన్ భగీరథ నీటిని తాగడం సురక్షితమని ఏఈ శ్రీనివాస్ తెలిపారు. బోనకల్‌లో గురువారం ప్రజా పాలన విజయోత్సవాలలో భాగంగా మిషన్ భగీరథ నీటి వినియోగం వలన కలిగే ప్రయోజనాల గురించి అవగాహన కల్పించారు. చేతి పంపుల వద్ద చెత్త, చెదారం లేకుండా శుభ్రం చేయించారు. సురక్షితమైన నీటిని తాగడం ద్వార ఆరోగ్యాభివృద్ధి సాధ్యమన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి రాజేశ్వరి, సిబ్బంది పాల్గొన్నారు.

ఝామికి జీవితం ఆదర్శం

కారేపల్లి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): గిరిజనుల వ్యవసాయకూలీలు ఎదుర్కొంటున్న సమస్యలపై, కూలీ రేట్లపెంపు కోసం పోరాడిన బొక్కలతండా కూలిమేస్త్రి మాలోత్ ఝామికి జీవితం ఆదర్శమని తెలంగాణ గిరిజన సంఘం మండల అధ్యక్షుడు అజ్మీర శోభన్ బాబు కొనియాడారు. గురువారం మండల పరిధిలోని బొక్కలతండాలో ఆమె దశదిన కర్మ జరిగింది.

భూసారాన్ని పెంచుకోవాలి: ఏవో



మట్టి పరీక్షపై రైతులకు వివరిస్తున్న ఏఈవో మౌనిక

ముదిగొండ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రైతులు భూసారాన్ని పెంచుకోవడం ద్వారా అనేక ప్రయోజనాలున్నాయని ఏవో వేణు సూచించారు. ముదిగొండ రైతువేదికలో భూసారాన్ని పెంచుకునే విధానంపై గురువారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ భూసారాన్ని పెంచే పచ్చిరొట్ట విత్తనాలైన జీలుగులు, పిల్లిపెసర, జనుము కలియదున్నటంతోపాటు పంటల సాగులో సేంద్రియ ఎరువులను వాడి పంట మార్పిడి చేసుకోవడం వల్ల భూసారం పెరుగుతుందని అప్పుడే పంట దిగుబడి వస్తుందని రైతులకు సూచించారు. అనంతరం మేడేపల్లిలో ప్రపంచ మృతిక దినోత్సవం సందర్భంగా మట్టి పరీక్ష చేయించుకునే విధానాన్ని రైతులకు వివరించి ఏఈవో మౌనిక మట్టి నమూనాను సేకరించారు. ప్రతి రైతు కూడా మట్టి నమూనా పరీక్ష చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

కబడ్డీ పోటీల్లో బీసీ హాస్టల్ విద్యార్థుల ప్రతిభ

మధిర, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఖమ్మంలో జరిగిన పోటీలలో జిల్లా స్థాయిలో జూనియర్స్ కబాడీ విభాగంలో మధిర బీసీ హాస్టల్ విద్యార్థులు ప్రథమ బహుమతి గెలుపొందారు. విజేతలకు కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈపోటీల్లో ప్రథమ బహుమతి గెలుపొందిన విద్యార్థులను మధిర డివిజన్ అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ డీ నరసయ్య, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఈలప్రోలు శ్రీనివాసరావులు అభినందిస్తూ ప్రోత్సహించారు.

హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్‌కు సన్మానం



నాయుడు సత్యనారాయణను సన్మానిస్తున్న ఆర్యవైశ్యులు

తల్లాడ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర చేనేత, హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణను గురువారం రాత్రి తల్లాడలో ఆర్యవైశ్య సంఘం నాయకులు సన్మానించారు. సత్తుపల్లి పర్యటన ముగించుకొని తల్లాడ వచ్చిన ఆయనను ఆర్యవైశ్య సంఘం నాయకులు జవ్వాజి నర్సింహారావు, వేమిశెట్టి నాగన్న, కేతేపల్లి భాస్కర్‌రావు తదితరులు పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీలు దగ్గుల రఘుపతిరెడ్డి, తాళ్ల జోసఫ్, వ్యాపారవేత్తలు జవ్వాజి నగేష్, అనుమోలు సర్వేశ్వరరావు, నంబూరి మధు పాల్గొన్నారు.

ముద్దునూరులో మొక్కలు నాటిన రైతులు

తల్లాడ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ నేల దినోత్సవం సందర్భంగా ఎఫ్ఎంసీ ఆధ్వర్యంలో గురువారం తల్లాడ మండలం ముద్దునూరు గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో రైతులు, విద్యార్థులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎఫ్ఎంసీ మేనేజర్ సురేన్ మాట్లాడుతూ ఆరోగ్యకరమైన నేల, పచ్చని ప్రకృతిని పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ ప్రతినభూనాలన్నారు. కార్యక్రమంలో బాబు, నరేష్, సుధాకర్ పాల్గొన్నారు.

సాంబయ్య సేవలు మరువలేనివి: బాగం

మధిర రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కమ్యూనిస్టు నేత, దివంగత సీపీఐ సీనియర్ నాయకుడు వూట్ల సాంబయ్య మడుపల్లి గ్రామానికి చేసిన సేవలు మరువలేనివని, నిత్యం పేదప్రజల పక్షాన ఉండేవారని సీపీఐ జాతీయకమిటీ సభ్యుడు బాగం హేమంతరావు కొనియాడారు. గురువారం మధిర మునిసిపాలిటీ పరిధిలోని మడుపల్లి గ్రామంసాంబయ్య 11వ వర్ధంతి కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర నాయకుడు జమ్ముల జితేందర్‌రెడ్డి, మధిర డివిజన్ నాయకులు బెజవాడ రవిబాబు, తోట రామాంజనేయులు, వూట్ల కొండలరావు, ఎం.ఏ.రహీం, పెరుమాళ్లపల్లి ప్రకాశరావు, పంగా శేషగిరి, అన్నవరపు సత్యనారాయణ, వూట్ల కామేశ్వరరావు పాల్గొన్నారు.

రేపటిలోపు సీఎం కప్‌కు దరఖాస్తు చేసుకోండి

మధిరటౌన్, డిసెంబరు5 (ఆంధ్రజ్యోతి): మధిర పట్టణ స్థాయిలో జరుగు సీఎం కప్ 2024 కు ఔత్సాహకులైన క్రీడాకారులు 7వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని మధిర మునిసిపల్ కమిషనర్ సంపత్‌కుమార్ గురువారం ఓ ప్రకటనలో కోరారు.

కబడ్డీ, కోకో, ఫుట్‌బాల్ క్రీడలకు వయోపరిమితి లేదని వాలీబాల్‌కు 18 సంవత్సరాల లోపు వారే పాల్గొనాలని, అథ్లెటిక్స్ పోటీలను 14 సంవత్సరాల లోపు 14 నుంచి 20 సంవత్సరాల వరకు లోపు, 20 సంవత్సరాల పైబడిన వారికి విడివిడిగా పోటీలు ఉంటాయన్నారు. వివరాలకు 9492967673 నెంబర్‌లో సంప్రదించ వలసిందిగా కోరారు.

నిరుపయోగంగా రైతు శిక్షణ భవనం

రూ.60లక్షలతో నిర్మించిన భవనం

అధికారులు దృష్టి సారించాలని స్థానికుల విన్నపం



నిరుపయోగంగా ఉన్న భవనం

వైరా, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పాడి పశుసంపద పెంచే లక్ష్యంతో దాదాపు పుష్కరకాలం కిందట రూ.60లక్షల పైచిలుకు నిధులతో వైరాలో నిర్మించిన అసెంబ్లీ నియోజకవర్గస్థాయి రైతు శిక్షణ భవనం నేటికీ ప్రారంభానికి నోచుకోలేదు. ప్రస్తుతం భవనం నిరుపయోగంగా మారి శిథిలావస్థకు చేరుకుంటుంది. దీని వలన లక్షలాదిరూపాయల ప్రజాధనం వృథా అయ్యే పరిస్థితి నెలకొంది. ఉమ్మడి ఏపీలో పశుసంపద అభివృద్ధిలో భాగంగా పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో గ్రామాల్లో క్లస్టర్ స్థాయిలో గోపాలమిత్ర భవనాలు నిర్మించారు. దానిలో భాగంగానే వైరాలోని పశువైద్యశాల ఆవరణంలో నియోజకవర్గ స్థాయి రైతుశిక్షణ భవనాన్ని నిర్మించారు. ఇంతవరకు ఈ భవనాన్ని ప్రారంభించలేదు. రైతులకు సంబంధించిన ఒక్క కార్యక్రమాన్ని కూడా నిర్వహించలేదు. 2020లో జరిగిన మునిసిపాలిటీ ఎన్నికల సమయంలో మాత్రం ఈ భవనాన్ని మునిసిపల్ ఎన్నికల బ్యాలెట్ బాక్సులు, ఎన్నికల సామగ్రిని పంపిణీ చేసి వాటిని భద్రపర్చేందుకు వినియోగించారు. ఇదే భవనంలో మునిసిపల్ ఎన్నికల కౌంటింగ్‌ను నిర్వహించారు. ఈ భవనంలోనే విజేతలను ప్రకటించారు. ఈ ఒక్క కార్యక్రమం మినహా ఈభవనంలో ఎలాంటి రైతుల శిక్షణ నడవలేదు. ఐదేళ్లుగా ఈ భవనం తలుపులు తీసే నాథుడే కరువయ్యారు. ఈభవనం చుట్టూ పిచ్చిమొక్కలు మొలిచి పాడుబడిన భవనంలా దర్శనమిస్తుంది. ప్రైవేట్ భవనాల్లో కొనసాగుతున్న ఏదో ఒక ప్రభుత్వ కార్యాలయాన్ని ఈ భవనంలో నిర్వహించే అవకాశమున్నా పట్టించుకొనే నాథుడే కరువయ్యారు. వందపడకల ఆసుపత్రికి భవనం లేనందున కొంతమంది డాక్టర్లు అయినా ఇక్కడ రోగులకు వైద్యసేవలందించేందుకు అవకాశముంది. అయినప్పటికీ దీని నిర్వహణపై ఏఒక్కరూ దృష్టిసారించలేదు. ఇప్పటికైనా ప్రజాప్రతినిథులు, అధికారులు శిథిలావస్థకు చేరుకుంటున్న ఈ భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

విద్యార్థులు మానసిక వత్తిడిని జయించాలి

మధిర, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మానసిక వత్తిడినుంచి బయటపడాలని మధిర వైద్యాధికారి డా. పృధ్వీరాజ్ సూచించారు. గురువారం మధిర ప్రభుత్వ జూనియర్‌కళాశాలలో 'టెలీ మానస్ అండ్ యాంటీ డ్రగ్స్' అనే కార్యక్రమం వైద్యశాఖ ఆధ్వర్యంలో జరిగింది. విద్యార్థులకు ఆయన టెలీ మానస్ గురించి వివరించారు. విద్యార్థులు మానసిన వత్తిడిని వదిలించుకోకపోతే పరీక్షలు సరిగా రాయలేరని, దాంతో వివిధ అలవాట్లకు లోనవుతారని తెలిపారు. పిల్లలు మానసిక స్థితిని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు గమనించి ఎప్పటికప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచనలు చేశారు. డాక్టర్ రామ్మోన్‌నాయక్, ప్రిన్సిపాల్ ఆర్ లత, ఎన్ఎస్ఎస్ పీడీ బీ తౌరియా, లైబ్రరియన్ గురువయ్య, అధ్యాపకులు, వైద్య సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులకు రూ. 84.96 లక్షల పంట రుణాలు పంపిణీ

కల్లూరు, డిసెంబరు 5 (ఆంధజ్యోతి): మండల పరిధిలోని చిన్నకోరుకొండి గ్రామంలో గురువారం పీఏసీఎస్ ఆధ్వర్యంలో రూ.84.96 లక్షల పంట రుణాలను కల్లూరు కేంద్ర సహకార బ్రాంచి మేనేజర్ రాణీ, సొసైటీ చైర్మన్ చావా వెంకటేశ్వరరావుల చేతుల మీదగా అందజేశారు. అందులో కొత్తగా సభ్యులైన 87 మంది రైతులకు రూ. 45.47 లక్షలు, ఇంకాను రుణామాపీ అయిన 64 మంది రైతులకు అదనంగా రూ.39.49 లక్షలు రుణాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ వి ప్రవీణ్‌కుమార్, సీఈఓ వేలాద్రి, బి వెంకటేశ్వరరావు, సిబ్బంది ఎన్ వీరబాబు, ఓ శ్రీను, రైతులు ఎస్‌కె ఖాదర్, రెడ్డి రామారావు, కొంగరపు శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడిపై దాడికి ఖండన

సత్తుపల్లిరూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఏపీలోని అన్నమయ్య జిల్లా రాయచోటిలో ఉర్దూ స్కూల్‌లో ఉపాధ్యాయుడు అజాజ్ అహ్మద్‌పై దాడిని ప్రభుత్వ ఉపాధ్యాయులు తీవ్రంగా ఖండించారు. గురువారం స్థానిక బాలికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో విద్యార్థుల ప్రవర్తనలో విపరీతమైన మార్పులు వచ్చాయని, వారిని సన్మార్గంలో పెట్టకపోతే ఈ తరం అంతా చెడిపోయే ప్రమాదం ఉందన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం నీరుడు నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు రవిచంద్ర, జానీ, భాను, ప్రమోదిని, చిట్టికుమారి, శ్రీదేవి, కవిత, అరుణకుమారి, రాజ్యలక్ష్మీ, శ్యామల, సరిత, షర్మిల, జయకుమారి, దేవమణి, పద్మిని, నాగమ్మ, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ ఎన్నికల విజయోత్సవ సంబరాలు

వైరా/ఏన్కూరు/పెనుబల్లి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): యూత్ కాంగ్రెస్ వైరా నియోజకవర్గ అధ్యక్ష ఎన్నికల్లో వైరాకు చెందిన గరిడేపల్లి కిషోర్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా బొల్లం గోపిచంద్ ఎన్నికైన సందర్భంగా బుధవారం రాత్రి విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్, మునిసిపల్ చైర్మన్ సూతకాని జైపాల్ తదితరులు కిషోర్, గోపిచంద్‌ను అభినందించారు. ప్రభుత్వం అమలుచేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని రాజశేఖర్, జైపాల్ సూచించారు. నాయకులు మిట్టపల్లి నాగి, ధార్న రాజశేఖర్, మచ్చా రామారావు, పణితి సైదులు, షేక్.రహీం, జాలాది రామకృష్ణ, ఏదునూరి శ్రీను, నాళ్ల రమేష్, రేచర్ల సత్యం, శ్రీను తదితరులు అభినందించారు.

సత్తుపల్లి నియోజకవర్గ అధ్యక్షుడిగా పసుమర్తి

పెనుబల్లి (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా పెనుబల్లి మండలం కుప్పెనకుంట్ల గ్రామానికి చెందిన పసుమర్తి విశ్వనాథ్ ఎన్నికయ్యారు. యూత్ కాంగ్రెస్ నిర్వహించిన ఈ ఎన్నికల్లో సత్తుపల్లి నియోజకవర్గ యూత్ అధ్యక్షుడిగా ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ బలపర్చిన విశ్వనాథ్ భారీ మెజార్టీతో గెలుపొందారు. తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి కృషిచేస్తానన్నారు.



విశ్వనాథ్



నాగేశ్వరరావు

యూత్ కాంగ్రెస్ ఏన్కూరు మండల అధ్యక్షుడిగా నిమ్మల

ఏన్కూరు (ఆంధ్రజ్యోతి): ఏన్కూరు మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా రేపల్లేవాడ గ్రామానికి చెందిన నిమ్మల నాగేశ్వరరావు ఎంపికయ్యారు. తనకు సహకరించిన సొసైటీ చైర్మన్ శెట్టిపల్లి వెంకటేశ్వరరావు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు స్వర్ణ నరేంద్ర, ఏబ్లాక్ అధ్యక్షుడు వేముల కృష్ణప్రసాద్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నతస్థాయికి ఎదగాలి

బోనకల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నతస్థాయికి ఎదగాలని ఎస్ఐ మధుబాబు సూచించారు. మండలంలోని ఆళ్లపాడు ఉన్నత పాఠశాలలో గురువారం పది విద్యార్థులకు అల్పాహారం అందించేందుకు బత్తినేని ట్రస్టు రూ. 20వేలు, శ్రీనిధి కళాశాల ప్రిన్సిపాల్ అనిల్ రూ. 10వేలు, పూర్వ విద్యార్థి పారా హర్షవర్ధన్ రూ. 10వేలు వితరణగా ఇచ్చారు. ఎస్ఐ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతం కోసం దాతల చేయుత దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం శ్రీదేవి, మరీదు బరకయ్య, తోటకూర వెంకటేశ్వరరావు, పారా శ్రీను, కందుల పాపారావు, బుంగా రాములు తదితరులు పాల్గొన్నారు.

'న్యూలిటిల్‌ఫ్లవర్'లో వనసమారాధన



మ్యాజిక్ షోలో చిన్నారులు

వైరా, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): వైరాలోని న్యూలిటిల్‌ఫ్లవర్ పాఠశాల విద్యార్థులు వనసమారాధన వేడుకను గురువారం నిర్వహించారు. సోమవరం గ్రామానికి సమీపంలోని మిట్టపల్లి వారి మామిడితోటలో ఈ వనసమారాధన జరిగింది. పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ పి.భూమేశ్వరరావు, డైరెక్టర్ కుర్రా సుమన్ వనదేవతలకు పూజలు చేసి వనసమారాధన ప్రారంభించారు. మ్యాజిక్ షో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆటపాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు, సహపంక్తి భోజనాలతో అలరించారు. ప్రిన్సిపాల్ షాజీ మాథ్యూవ్ పాల్గొన్నారు

విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలి



వంటలను పరిశీలిస్తున్న ఈడీ నవీన్‌బాబు

కొణిజర్ల, డిసెంబరు5 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం నాణ్యతతో ఉండాలని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ నవీన్‌బాబు సూచించారు. గురువారం మండలంలోని పెద్దగోపతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. విద్యార్థులకు వడ్డించే అన్నం, వంటకాలను, పాఠశాలలోని మౌలికవసతులను పరిశీలించారు. మాట్లాడుతూ భోజనం విషయంలో నిర్లక్ష్యం చేయవద్దన్నారు. పాఠశాలలో తాగునీరు వసతిని, మూత్రశాలలను పరిశీలించారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్ఎం నరసింహరావు పాల్గొన్నారు.

ఘనంగా అంకమ్మ దేవాలయ శిఖర ప్రతిష్ఠా మహోత్సవం



శిఖర ప్రతిష్ఠా మహోత్సవాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

వేంసూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): వేంసూరులో అంకమ్మ దేవాలయ శిఖర ప్రతిష్ఠా మహోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రతిష్ఠా మహోత్సవాన్ని పురస్కరించుకొని గత రెండురోజులుగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు దంపతులు హోమంపూజలు చేశారు. అనంతరం మహాఅన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

మంత్రులకు ఎమ్మెల్యే రాగమయి ఘన స్వాగతం

సత్తుపల్లి నుంచి బుగ్గపాడు వరకు భారీ మోటారు సైకిల్ ర్యాలీ



ర్యాలీగా వస్తున్న ఎమ్మెల్యే రాగమయి, కాంగ్రెస్ నాయకులు

సత్తుపల్లి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి మండలం బుగ్గపాడులో మెగా ఫుడ్‌పార్క్ ప్రారంభోత్సవంతో పాటు ప్రజాపాలన విజయోత్సవ సభలో పాల్గొనేందుకు గురువారం సత్తుపల్లి వచ్చిన మంత్రులు శ్రీధర్‌బాబు, తుమ్మల నాగేశ్వరరావులకు సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, కాంగ్రెస్ నాయకులు డా.మట్టా దయానంద్ స్వాగతం పలికారు. హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో మంత్రులు సత్తుపల్లిలోని జేవీఆర్ డిగ్రీ కళాశాల ఆవరణకు చేరుకున్నారు. అక్కడి నుంచి బుగ్గపాడు ఫుడ్‌పార్క్‌కు రోడ్డుమార్గం ద్వారా వచ్చి కార్యక్రమంలో పాల్గొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ ఏడాది పాలన సందర్భంగా విజయోత్సవాలలో భాగంగా వందలాది మంది కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సత్తుపల్లి డిగ్రీ కళాశాల నుంచి బుగ్గపాడు వరకు భారీ మోటారు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ అగ్రభాగంలో ఓపెన్ టాప్‌లో ఎమ్మెల్యే రాగమయి, ఐబీసీ చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి ప్రజలు, కార్యకర్తలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. ఫుడ్‌పార్క్‌లో కార్యక్రమానికి ముందు మంత్రులు, కార్పొరేషన్ చైర్‌పర్సన్స్ అధికారులతో కలసి అక్కడ ఏర్పాటు చేసిన వ్యవసాయ ఉత్పత్తులు, డ్రోన్లు, క్రిమి సంహారక మందులు, కొబ్బరి విత్తనోత్పత్తి, ఎరువులు, పురుగు మందులు ఇతర స్టాల్స్‌ను ఆసక్తిగా గమనించారు. స్టాల్స్ ఏర్పాటుకు వ్యవసాయ, ఉద్యానవన శాఖల అధికారులు కృషి చేశారు. వీరిని వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు అభినందించారు.

ఆరు గ్యారెంటీల అమలులో కాంగ్రెస్ విఫలం: బీజేపీ



వైరాలో ర్యాలీ నిర్వహిస్తున్న కిసాన్‌మోర్చా నాయకులు

వైరా/కల్లూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీల హామీతో అధికారంలోకి వచ్చి వాటి అమలులో పూర్తిగా వైఫల్యం చెందిందని కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి విమర్శించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి పిలుపు మేరకు గురువారం వైరా నియోజకవర్గంలోని కొణిజర్ల నుంచి వైరా వరకు నిర్వహించిన మోటర్‌సైకిళ్ల ర్యాలీలో శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు. వైరాలో ఆరు గ్యారెంటీల అమలులో కాంగ్రెస్ వైఫల్యంపై చార్జ్‌షీట్ విడుదల చేసిన శ్రీధర్‌రెడ్డి తర్వాత ప్రసంగించారు. ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం అన్నివిధాలుగా మోసం చేసిందని ఆపార్టీ అధికారంలో కొనసాగే నైతిక హక్కు లేదని ధ్వజమెత్తారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్యామ్‌రాథోడ్, వైరా నియోజకవర్గ కన్వీనర్ నెల్లూరి కోటేశ్వరరావు, నాయకులు బండారు నరేష్, నరుకుళ్ల వెంకటేశ్వరరావు, మనుబోలు వెంకటకృష్ణ, కోసూరి గోపాలకృష్ణ, దుద్దుకూరి కార్తీక్, ఏపూరి శ్రీనివాసరావు, కొవ్వూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రజను మోసగిస్తున్న కాంగ్రెస్

కల్లూరు (ఆంధ్రజ్యోతి) ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు పరచకుండ ప్రజలను మోసగించిందని బీజేపీ జాతీయ నాయకుడు పొంగులేటి సుధాకర్‌రెడ్డి విమర్శించారు. మండలంలోని నారాయణపురం గ్రామంలో గురువారం బీజేపీ సంస్థగతంగా బూత్ లెవల్ కమిటీల్లో ఎంపికైన వారికి నియామక పత్రాలను అందజేశారు. సుధాకర్‌రెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. రాష్ట్రంలో బీఆర్ఎస్, కాంగ్రెస్‌లు రాజకీయంగా మ్యాచ్ ఫిక్సింగ్‌లకు పాల్పడుతున్నాయని ధ్వజమెత్తారు. తన స్వగ్రామమైన నారయణపురంలో బూత్‌నెం 94, 95 లకు సంస్థాగతంగా కమిటీల ఎంపిక చేసి వారికి నియామక పత్రాల ను అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ ఖమ్మం పార్లమెంటరీ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరరావు, సత్తుపల్లి నియోజకవర్గ కన్వీనర్ బి వీరంరాజు, మండల బీజేపీ నాయకులు ప్రసాదరావు, టీ పుల్లారావు, వెంకటరామారావు, సుబ్బారావు, పద్మావతి, కృష్ణ, చారి, కిషోర్ పాల్గొన్నారు.